@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
సోమవారం 23 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

- ప్రపంచ బ్యాంకు నివేదికతో దేశానికి గర్వకారణం
- బీజేపీ పాలనలోనే ఈ ఘనత సాధించామన్న మోదీ
- పేదల సంక్షేమానికి పథకాలే కీలకం
- బ్యాంకు ఖాతాలు, గ్యాస్, విద్యుత్‌తో ప్రయోజనాలు
- సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించాం
- రాబోయే తరాలు స్వర్ణయుగాన్ని చూస్తాయి



ప్రేమకు అడ్డుగా ద్వేష భావజాలం!

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ధ్వజం
- భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అవగాహన లేదు



ఏపీలో నూతన మున్సిపల్ పాలకవర్గాల కొలువుదీరింపు నేడే!

- 100 పట్టణ స్థానిక సంస్థల్లో తొలి సమావేశాలు..
- మేయర్లు, ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం
- 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో సమావేశాలు
- ఐదేళ్ల పదవీకాలానికి నేటి నుంచే శ్రీకారం
- డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక కూడా నేడే
- తొలి సమావేశాల నిర్వహణకు ఎస్ఈసీ నోటిఫికేషన్
- కమిషనర్లకు ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు
- స్థానిక పాలనలో కొత్త పాలకవర్గాల ప్రస్థానం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో నూతన మున్సిపల్ పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల తొలి సమావేశాలను సోమవారం (నవంబర్ 23) నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదివారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. - మిగతా3లో

రెండున్నరేళ్ల పాలనకు ప్రజల గుర్తింపు

- స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయి
- పంచాయతీల్లో ఏకగ్రీవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమికి ప్రజామద్దతు
- పంచాయతీల్లో పోటీ కంటే గ్రామాభివృద్ధే ముఖ్యం
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- గతంలో రూ.20 లక్షలుగా ఉన్న నజరానా పెంపు



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాలు ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన గుర్తింపుగా నిలిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయని పేర్కొన్నారు. పార్టీ గుర్తులపై జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో స్థానిక ఎన్నికల ఫలితాలపై సమీక్షించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పోటీ కంటే గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. పార్టీల మధ్య పోరాటం పక్కనపెట్టి గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అనవసరమైన రాజకీయ - మిగతా3లో

భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక చర్చలేవీ జరగలేదు

- ఎస్సీవో వేదికపై కేంద్రం స్పష్టత.. సాధారణ సంభాషణలే జరిగాయని వెల్లడి
- ద్వైపాక్షిక చర్చలపై కేంద్రం స్పష్టత.. పాక్ మంత్రితో సాధారణ సంభాషణలే
- ఇంద్రప్రస్థ కమ్యూనిక్ విడుదల.. వారసత్వ పరిరక్షణకు ఏఐ వినియోగం
- యునెస్కో గుర్తింపునకు ఉమ్మడి నామినేషన్లు.. నాలుగు కీలక అంశాలపై చర్చలు
- ప్రపంచ శాంతికి సంస్కృతి వారధి.. వసుధైవ కుటుంబకానికి ఎస్సీవో మద్దతు..





అగ్నివీరులకు పెళ్లికి గ్రీన్‌సిగ్నల్

- రెండేళ్ల సర్వీసు పొడిగింపు ఎంచుకునేవారికి అవకాశం..
- నాలుగు వారాల శిక్షణ తర్వాతే అనుమతి
- 75 శాతం మందికి మరో రెండేళ్ల అవకాశం
- నిబంధనల సడలింపుతో ఊరట

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

- జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్
- కూటమి ప్రభుత్వంలో గ్లోబల్ బ్రాండ్లు భారీ పెట్టుబడులు పెట్టాయని వెల్లడి
- గూగుల్, రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టుల వివరాలు ప్రస్తావన
- గతంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేశారంటూ లోకేశ్ ఆరోపణ
- రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరియు ఉద్యోగాల కల్పన అంశాలపై వైసీపీ అధినే జగన్ కు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి అగ్రశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, తద్వారా వేలాది మంది - మిగతా3లో

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ!

- నామినేషన్లు వేసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు..
- ఐదు జోన్లలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు: పవన్ కల్యాణ్
- జనసైనికులు, వీరమహిళలు స్వేచ్ఛగా పోటీ చేయవచ్చు
- కూటమి పార్టీల మధ్య పంచాయతీల్లో సీట్ల పంపకాలు ఉండవు
- పోటీ చేసే అభ్యర్థులకు అండగా ప్రత్యేక హెల్ప్‌డెస్క్
- ఐదు జోన్లుగా రాష్ట్ర విభజన.. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసైనికులు, వీరమహిళలు ఎలాంటి రాజకీయప రమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు పార్టీ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీ ఎన్నికలు జరగాలని పవన్ ఆకాంక్షించారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భిన్నంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలు ఉండవని పవన్ స్పష్టం చేశారు. - మిగతా3లో



చైనా సరిహద్దు గ్రామాల్లో పెరిగిన జనాభా

- 40 గ్రామాలకు తిరిగొచ్చిన ప్రజలు.. వలసలకు అడ్డుకట్ట: అమిత్ షా
- అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి
- అరుణాచల్‌కు కేంద్ర నిధులు భారీగా పెంపు

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు



50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

దాదాపు 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్న ప్రపంచ బ్యాంకు నివేదికపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని అంగీకరించేందుకు ప్రతిపక్షాలు సంకోచిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కొందరు ఈ వాస్తవాన్ని గుర్తించేందుకు వెనుకాడుతున్నారని వ్యాఖ్యానించారు.

ప్రపంచ బ్యాంకు నివేదికపై హర్షం

గుజరాత్‌లోని 182 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దీపావళి అనంతరం నిర్వహించిన 'స్నేహ్ మిలన్' కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. వెయ్యేళ్ల బానిసత్వం కారణంగా దేశం పేదరికంలో కూరుకుపోయిందని, స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం గొప్ప విజయమని పేర్కొన్నారు.



సంక్షేమ పథకాలతో మార్పు

పేదల కోసం బ్యాంకు ఖాతాలు తెరవడం, వంటగ్యాస్ కనెక్షన్లు అందించడం, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, విద్యుత్ కనెక్షన్లు కల్పించడం వంటి చర్యలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని మోదీ వివరించారు. ప్రారంభంలో ఈ పథకాలపై కొందరు ప్రశ్నలు లేవనెత్తినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు.

చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనాలు

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేశామని తెలిపారు. సామాజిక న్యాయం అంటే ఏమిటో ఆచరణలో చూపించామని పేర్కొన్నారు. పేదరికం నుంచి ప్రజలు బయటపడటం వారి జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

తాను గుజరాత్‌తో పాటు దేశానికి సేవ చేసే స్థాయికి చేరుకోవడానికి బీజేపీ కార్యకర్తల కృషి, సహకారమే కారణమని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే తరాలు దేశ స్వర్ణయుగాన్ని చూస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఘట్లోడియా నియోజకవర్గం నుంచి ప్రధాని ప్రసంగాన్ని వర్చువల్‌గా వీక్షించారు.

భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక చర్చలేవీ జరగలేదు

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు జరగలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దిల్లీలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) మూడు రోజుల సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్‌లో పాక్ ప్రతినిధులతో కేవలం సాధారణ సంభాషణలు మాత్రమే జరిగాయని వెల్లడించింది. పాకిస్థాన్ తరఫున హాజరైన ఆ దేశ పర్యావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌తో అధికారిక చర్చలు జరపలేదని తేల్చిచెప్పింది.

ఇంద్రప్రస్థ కమ్యూనిక్ విడుదల

సదస్సు ముగింపు సందర్భంగా సభ్య దేశాల సూచనలతో రూపొందించిన 'ఇంద్రప్రస్థ కమ్యూనిక్'ను కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ విడుదల చేశారు. సాంస్కృతిక వారసత్వాన్ని అక్రమ రవాణా, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించుకోవాలని ఈ ప్రకటన పిలుపునిచ్చింది. ప్రతి నాగరికతను సమాన గౌరవంతో చూడాలని, వాస్తుశిల్పం, సంగీతం, వంటకాలు, వస్త్రధారణలోని ఉమ్మడి వారసత్వాన్ని గుర్తించాలని సూచించింది.

వారసత్వ పరిరక్షణకు సాంకేతికత

సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)ను నిర్మాణాత్మకంగా వినియోగించుకోవాలని కమ్యూనిక్ పేర్కొంది. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం సభ్య దేశాలు ఉమ్మడిగా నామినేషన్లు సమర్పించాలని తీర్మానించింది. దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడంలో సంస్కృతి



వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడింది.

నాలుగు అంశాలపై సాంకేతిక సమావేశాలు

పురానా ఖిలాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఫోరమ్‌లో పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయని వివేక్ అగర్వాల్ తెలిపారు. తాళపత్ర గ్రంథాలు, భాషా వారసత్వం, పురావస్తు శాస్త్రం, సాంస్కృతిక వ్యక్తీకరణలు, బౌద్ధ మఠాల మార్గాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారని వివరించారు. సభ్య దేశాల ప్రతినిధులు కూడా పలు సూచనలు అందించారని పేర్కొన్నారు.

ప్రపంచ శాంతికి సంస్కృతి వారధి

ఈ వేదిక ద్వారా భాగస్వామ్య దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి, సామరస్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడంలో ఫోరం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భారతదేశం ప్రతిపాదించిన 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) భావన ఎస్‌సీఓ సభ్య దేశాలు, సంభాషణ భాగస్వాములో ప్రతిధ్వనిస్తోందని పేర్కొన్నారు. ఈ నెల 20న ప్రారంభమైన ఎస్‌సీఓ సివిలైజేషన్ డైలాగ్ ఫోరమ్ ఆదివారంతో ముగిసింది.

చైనా సరిహద్దు గ్రామాల్లో పెరిగిన జనాభా

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సరిహద్దుకు సమీపంలోని 40 గ్రామాల్లో జనాభా పెరిగిందని, అక్కడి నుంచి వలసలు తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో ఉపాధి, ఆరోగ్య, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో ప్రజలు తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధిని విస్మరించారని, రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి భారీగా నిధులు పెంచిందని వివరించారు. అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా ఇటానగర్‌లో నిర్వహించిన సహకార సదస్సులో ఆయన మాట్లాడారు. 2004-2014 మధ్య యూపీఏ ప్రభుత్వం అరుణాచల్‌ప్రదేశ్‌కు రూ.33,530 కోట్లు కేటాయించగా, 2014-2024 మధ్య ఎన్డీయే ప్రభుత్వం రూ.1,64,664 కోట్ల ఆర్థిక సహాయం అందించిందని అమిత్ షా వెల్లడించారు. రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా నాలుగు రెట్లు, గ్రాంట్లు 18 రెట్లు పెరిగాయని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్ బడ్జెట్ రూ.12 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు పెరగడం రాష్ట్రంలో అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాలను దేశంలోని చివరి గ్రామాలుగా కాకుండా తొలి గ్రామాలుగా చూడాలన్న ప్రధాని మోదీ ఆలోచనతో అక్కడి అభివృద్ధికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రాథమిక సదుపాయాలతో పాటు జీవనోపాధి అవకాశాలు



కల్పించడమే లక్ష్యమని చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్' వలసలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోందని, దాదాపు 40 గ్రామాల్లో ప్రజలు తిరిగి నివసించడం ప్రారంభించడంతో జనాభా పెరిగిందని వివరించారు.

ఈశాన్యంలో మెరుగైన రవాణా సౌకర్యాలు

గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో ఈశాన్య ప్రాంతంలో రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని అమిత్ షా అన్నారు. ఈశాన్య రాష్ట్రాల రాజధానులకు రోడ్డు, రైలు, విమాన మార్గాల ద్వారా అనుసంధానాన్ని మెరుగుపరిచామని తెలిపారు. విద్య, ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి, పారిశ్రామిక రంగాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, పర్యాటక సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధికి మరింత దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సహకార సంఘాల ఉత్పత్తులకు ప్రోత్సాహం

అరుణాచల్‌ప్రదేశ్‌లోని సహకార సంఘాల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని హోంమంత్రిత్వ శాఖ ఐటీబీపీ, సైన్యాన్ని ఆదేశించిందని అమిత్ షా తెలిపారు. దీనివల్ల సరిహద్దు గ్రామాల ప్రజలకు, సాయుధ బలగాలకు మధ్య సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. మహిళలు సహకార సంఘాల ద్వారా పాల ఉత్పత్తులు, గుడ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, పిండి వంటి వాటిని సరఫరా చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఉపాధి, విద్య, వైద్య సదుపాయాలు, కుటుంబాల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.

స్వయం సమృద్ధి సాధించే మార్గాలు అన్వేషించాలి: కిరణ్ రిజిజు

అరుణాచల్‌ప్రదేశ్ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పిలుపునిచ్చారు. ప్రజల గుర్తింపు, భూ హక్కులు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే పెట్టుబడులు, సాంకేతికత, ఆధునిక సౌకర్యాలను ఆకర్షించే విధానాలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన స్వభావం, పరిమిత వనరులు, భూ యాజమాన్యంపై ఉన్న ఆంక్షల కారణంగా రాష్ట్రం ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధి వేగవంతమైందని పేర్కొన్నారు.

అగ్నివీరులకు పెళ్లికి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో సేవలందిస్తున్న అగ్నివీరులకు కేంద్రం కీలక వెసులుబాటు కల్పించినట్లు వార్తలు వెలువడ్డాయి. నాలుగేళ్ల ప్రాథమిక సర్వీసు పూర్తి చేసుకుని మరో రెండేళ్లపాటు విధుల్లో కొనసాగాలని నిర్ణయించుకునే అగ్నివీరులు వివాహం చేసుకునేందుకు అనుమతి లభించనుంది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు వర్తించనున్నాయి. రెండో విడత సర్వీసులో చేరే సమయంలో అవివాహితులుగా ఉండటంతో పాటు, సుమారు నాలుగు వారాలపాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వివాహానికి అనుమతి లభిస్తుందని రక్షణ వర్గాలను ఉటంకిస్తూ కథనాలు వెల్లడించాయి.

నాలుగేళ్ల సర్వీసులో పెళ్లికి నో

2022 జూన్ 14న కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం నిబంధనల ప్రకారం అగ్నివీరులు నియామక సమయంలో అవివాహితులై ఉండాలి. నాలుగేళ్ల ప్రాథమిక సర్వీసు పూర్తయ్యే వరకు వివాహం చేసుకోవడానికి అనుమతి లేదు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే సర్వీసు నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. తాజాగా రెండేళ్ల అదనపు సర్వీసును ఎంచుకునే వారికి మాత్రం కొన్ని షరతులతో వివాహానికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. అగ్నిపథ్ పథకం ఎప్పటికప్పుడు సమీక్షకు లోబడి ఉంటుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి గతంలో పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కీలక మార్పులు చేసింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అగ్నివీరుల్లో ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని సాధారణ సాయుధ దళాల్లోకి తీసుకునే నిబంధన కొనసాగనుంది. మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్లపాటు సేవలందించే అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ అదనపు సర్వీసు పూర్తయిన తర్వాత సాయుధ దళాల్లో శాశ్వతంగా చేరేందుకు ఆసక్తి చూపే వారికి మరో అవకాశం కల్పించనున్నారు. అయితే వారి అంగీకారంతో పాటు నిర్దేశిత ఎంపిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయాన్ని నవంబర్ 4న సీడీఎస్ జనరల్ రాజా సుబ్రమణి వెల్లడించారు.

నిబంధనల సడలింపుతో ఊరట

అగ్నివీరులు 17.5 నుంచి 21 ఏళ్ల మధ్య వయసులో సైన్యంలో చేరుతున్నారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తయ్యే సమయానికి వారి వయసు 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత, కుటుంబ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో వివాహ నిబంధనల్లో సడలింపు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. రెండో విడత సర్వీసులో చేరే సమయంలోనూ అవివాహితులుగా ఉండాలన్న నిబంధన కొనసాగనుంది. నాలుగు వారాల శిక్షణ అనంతరం వివాహం చేసుకోవచ్చని తాజా కథనాలు పేర్కొంటున్నాయి.

పథకంలో మరిన్ని మార్పులకు అవకాశం

అగ్నిపథ్ పథకాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని కేంద్రం గతంలోనే ప్రకటించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పనితీరును పరిశీలించిన అనంతరం సర్వీసు పొడిగింపుపై నిర్ణయం తీసుకుంది. అదనపు రెండేళ్ల సర్వీసులో మెరుగైన వేతనం, సేవా నిధి ప్రయోజనాలు, సీనియారిటీకి సంబంధించిన వెసులుబాట్లు కూడా కల్పించనున్నారు. భవిష్యత్తులో సైనిక నియామకాలు, సర్వీసు నిబంధనల్లో మరిన్ని మార్పులు వచ్చే అవకాశముందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది.

తూర్పు గాలుల ప్రభావంతో వర్షాలు:

మరోవైపు, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో కురుస్తున్న వర్షాలకు, నెలాఖరులో రాబోయే ఆవర్తనానికి ఎలాంటి సంబంధం లేదని ఐఎండీ స్పష్టం చేసింది. తూర్పు గాలుల (ఈస్టర్లీ వేవ్స్) ప్రభావంతో వచ్చే కొద్దిరోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో నవంబర్ 22 నుంచి 28 వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా నవంబర్ 23 నుంచి 26 మధ్య ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలలో నవంబర్ 23 నుంచి 27 వరకు భారీ వర్షాలు, కేరళలో నవంబర్ 24 నుంచి 26 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు పడవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో రాగల రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ తీరానికి ప్రస్తుతం ఎలాంటి తుపాను ముప్పు లేదా రెడ్ అలర్ట్ లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రేమకు అడ్డుగా ద్వేష భావజాలం!

న్యూఢిల్లీ: భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు సరైన అవగాహన లేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతీయ సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకుంటున్న కొద్దీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలంలోని లోపాలు స్పష్టమవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ఎలిఫెంటా గుహల్లోని 12వ శతాబ్దానికి చెందిన శివపార్వతుల శిల్పం ఫొటోను షేర్ చేశారు. 'సత్యం శివం సుందరం' అంటూ తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల మనసుల్లో భయం, కోపం, ద్వేషం పేరుకుపోయాయని, అవే ప్రేమను అనుభవించకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయని రాహుల్ ఆరోపించారు. కులతత్వం, పురుషాధిక్య భావజాలం నుంచి వారు బయటపడాలని పేర్కొన్నారు. నిజమైన హిందువుగా వారిని ఆ భావజాలం నుంచి బయటకు తీసుకురావడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

శివపార్వతుల శిల్పంతో కౌంటర్

తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇటీవల రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. భోజనం చేసే సమయంలో తన తండ్రి రాజీవ్‌గాంధీ ఒడిలో తల్లి సోనియా కూర్చునేవారని, స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి తల్లిదండ్రులు అలా కూర్చోకపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ సహా పలువురు నేతలు రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో శివపార్వతుల శిల్పం ఫొటోను షేర్ చేస్తూ రాహుల్ తనదైన శైలిలో విమర్శలకు సమాధానమిచ్చారు.

మోదీ వ్యాఖ్యలపైనా విమర్శలు

ఇదిలా ఉండగా, వేతనాల పెంపు, ఉద్యోగాల కల్పన అంశాలపై కార్పొరేట్ సంస్థల అధినేతలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపైనా రాహుల్ గాంధీ స్పందించారు. ఫిక్కీ శతాబ్ది సదస్సులో ప్రధాని చేసిన ప్రసంగంపై విమర్శలు గుప్పించారు. పన్ను రాయితీలు కల్పిస్తున్నప్పటికీ పరిశ్రమలు ఉద్యోగుల వేతనాలను పెంచడం లేదని, తగినన్ని ఉపాధి అవకాశాలు సృష్టించడం లేదని ప్రధాని చెప్పడం ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యాన్ని అంగీకరించడమేనని వ్యాఖ్యానించారు.

గుత్తాధిపత్యాలకు ప్రభుత్వమే కారణం: రాహుల్

ప్రభుత్వ విధానాలు గుత్తాధిపత్యాలను ప్రోత్సహిస్తున్నాయని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) బలహీనపరుస్తున్నాయని రాహుల్ ఆరోపించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్, రహదారులు వంటి కీలక రంగాల్లో కొందరి ఆధిపత్యం పెరిగిందని విమర్శించారు. ఇన్ని రంగాలపై పట్టు సాధించిన సంస్థలు ఎన్ని ఉద్యోగాలు సృష్టించాయని ప్రశ్నించారు. ప్రధాని వ్యాఖ్యలు ప్రభుత్వ విధానాల వైఫల్యాలను స్వయంగా వెల్లడిస్తున్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అలర్ట్
బుకింగ్ డేట్ మిస్ అయితే ఇక దర్శనం లేనట్లే!

శబరిమల అయ్యప్ప దర్శన వర్చువల్ క్యూ బుకింగ్ విధానంలో కఠిన నిబంధనలు రానున్నాయి. వాటిని అమలు చేసేందుకు పోలీసులు, ట్రావెన్?కోర్ దేవస్థానం బోర్డు సిద్ధమవుతున్నాయి. బుక్? చేసుకున్న తేదీన దర్శనానికి వెళ్లని భక్తులు, తమ టికెట్?ను రద్దు చేసుకోవడం లేదా రీషెడ్యూల్ చేయకపోతే మండల సీజన్‌లో మరోసారి బుకింగ్ చేసుకునే అవకాశం కోల్పోవచ్చు. అయితే అనివార్య కారణాలతో దర్శనానికి వెళ్లలేని వారు ముందుగానే తమ బుకింగ్‌ను రద్దు చేసుకోవడానికి లేదా మరో తేదీకి మార్చుకోవడానికి అవకాశం కల్పించనున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు భక్తుల గుర్తింపు పత్రాలను సేకరించి, పెద్ద మొత్తంలో టికెట్లు బుక్ చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ తర్వాత వాటిని భక్తులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు ఆధార్ ఆధారిత ఓటీపీ ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. టికెట్ బుక్ చేసుకునే సమయంలో భక్తుల ఆధార్? నంబర్ నమోదు చేయడంతో పాటు, దానికి అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి భక్తుడికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయించి, పంపా లేదా నిలక్కల్ వద్ద తనిఖీ చేసే విధానాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. శబరిమలలో రోజుకు 80వేల మంది భక్తులకు దర్శనం చేసుకునేందుకు అనుమతి ఉన్నప్పటికీ, కొన్ని రోజుల్లో అనుమతించిన సంఖ్యలో సగం మంది మాత్రమే ఆలయానికి చేరుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు.

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ!

-మొదటిపేజీ తరువాయి

గ్రామస్థాయిలో పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలను పార్టీ శ్రేణులు అడ్డుకోవద్దని ఆదేశించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక సంస్థలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అభ్యర్థులకు అండగా ప్రత్యేక హెల్ప్‌డెస్క్

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలు నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు అభ్యర్థులకు ఎదురయ్యే సమస్యలపై ఈ కేంద్రం స్పందించనుంది. సమస్యలను వెంటనే పార్టీ కేంద్ర ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ దృష్టికి తీసుకురావాలని పవన్ సూచించారు.

ఐదు జోన్లుగా విభజన

రాష్ట్రవ్యాప్తంగా హెల్ప్‌డెస్క్ కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి జోన్‌లో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించేలా ఏర్పాట్లు చేశారు. హెల్ప్‌డెస్క్ కార్యకలాపాలను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ పర్యవేక్షించనున్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులకు ఎదురయ్యే సమస్యలపై తక్షణమే స్పందించేలా పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

మూడు విడతల ఎన్నికలకు సన్నద్ధం

రాష్ట్రంలో మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాల స్ఫూర్తిని పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న జరగనున్న తొలి విడత ఎన్నికలకు జనసేన నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారని ముఖ్య నేతలు ఆయనకు వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

మూడు విడతల్లోనూ పంచాయతీ ఎన్నికలు సామరస్యపూర్వకంగా జరగాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఫలితాల అనంతరం కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య ఐక్యతకు నిదర్శనంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.



యలహంక ప్యాలెస్ వద్ద షర్మిలను అడ్డుకున్న పోలీసులు

బెంగళూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సోదరి వైఎస్ షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బెంగళూరుకు చేరుకున్న షర్మిల యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ప్యాలెస్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి లేదని ఆమెకు వివరించారు. దీంతో పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. చివరకు ఆమె అక్కడికి వెళ్లకుండా నగరంలోని లీలా ప్యాలెస్ హోటల్‌కు బయలుదేరారు. తల్లి విజయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న షర్మిలతో పోలీసులు మాట్లాడారు. యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు అనుమతి లేదని, కోర్టు ఉత్తర్వులను పాటించాలని సూచించారు. విమానాశ్రయం నుంచి యలహంక వైపు వెళ్లే మార్గంలో ఆమె వాహనాలను అనుమతించకుండా నగరంలోని మరో మార్గంలోకి మళ్లించారు. షర్మిల బెంగళూరు వస్తున్న విషయం ముందే తెలియడంతో విమానాశ్రయం, యలహంక ప్యాలెస్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోర్టు ఆదేశాలతో పోలీసుల చర్యలు

యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల ప్రవేశించకుండా అడ్డుకోవాలని కోరుతూ జగన్ సంబంధిత సంస్థ ప్రతినిధి భీమిశెట్టి రమేష్‌బాబు ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు కథనంలో పేర్కొన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్లిలోని సీనియర్ సివిల్ జడ్జి, జేఎంఎఫ్‌సీ కోర్టులో ఈ పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలను పరిశీలించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు షర్మిలతో పాటు ఆమెకు సంబంధించిన వ్యక్తులు యలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశించకుండా మధ్యంతర ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసింది.

ఆస్తి హక్కులపై వివాదం

యలహంక ప్యాలెస్ తమ సంస్థ లీజులో ఉందని పిటిషనర్ తరఫు వాదనగా పేర్కొన్నారు. భారతి తల్లి ఇ.సి. సుగుణమ్మ 2007 మార్చి 1న 20 ఏళ్ల కాలానికి, అంటే 2027 ఫిబ్రవరి 28 వరకు ప్యాలెస్‌ను తమ సంస్థకు లీజుకు ఇచ్చారని రమేష్‌బాబు తరఫు న్యాయవాది కోర్టుకు వివరించినట్లు కథనంలో ఉంది. ప్యాలెస్‌లో పండ్ల తోటలు, మొక్కలు, గెస్ట్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, సుగుణమ్మ 2026 ఆగస్టు 27న తన కుమార్తె భారతి, మనుమరాళ్లకు ప్యాలెస్‌ను గిఫ్ట్ డీడ్ ద్వారా బదిలీ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఉండేందుకు గతంలో అనుమతి పొందిన షర్మిల.. ప్రస్తుతం అలంకరణ పనుల పేరుతో బయటి వ్యక్తులను ప్యాలెస్‌లోకి పంపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల అక్కడి నిర్మాణాలు, ఫెన్సింగ్, పండ్ల చెట్లు, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పెళ్లి వేదిక మార్పుతో వివాదం

షర్మిల తన కుమార్తె అంజలి రెడ్డి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంపినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అక్కడ వివాహం నిర్వహించడంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాను నివసిస్తున్న ప్రాంగణంలో వివాహం నిర్వహిస్తే భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ షర్మిలకు లేఖ రాసినట్లు కథనంలో వెల్లడించారు. దీంతో వివాహ వేదికను షర్మిల మరోచోటికి మార్చుకున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పెళ్లి ఏర్పాట్లలో భాగంగా యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు ఆమె ప్రయత్నించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పిటిషన్ దాఖలు కావడం, కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆమెను అడ్డుకోవడం తాజా పరిణామాలుగా మారాయి.

డిసెంబర్ 19న తదుపరి విచారణ

పిటిషనర్ తరఫు న్యాయవాది సమర్పించిన వాదనలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. ప్రాథమికంగా ప్యాలెస్ పిటిషనర్ స్వాధీనంలో ఉన్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడినట్లు కథనంలో పేర్కొన్నారు. తదుపరి విచారణ జరిగే వరకు షర్మిల, ఆమెకు సంబంధించిన వ్యక్తులు ప్యాలెస్‌లోకి ప్రవేశించకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణ డిసెంబర్ 19న జరగనుంది.

గ్రామాల్లో కూటమి సత్తా చూపిస్తాం

విజయవాడ : ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించిన రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మనం 94 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తే, ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం స్ట్రైక్ రేట్ విజయం సాధించామన్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పరిషత్ ఎన్నికల్లోనూ ప్రజలు తమపై నమ్మకంతో అద్భుత ఫలితాలు ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ సెంట్రల్ ఆఫీసులో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఈ స్థానిక ఎన్నికల ఫలితాలను రెండున్నరేళ్ల కూటమి సర్కార్ పాలనకు ప్రజలిచ్చిన తీర్పుగా భావిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్, ఈవీఎం ఇలా ఎన్నిక ఏదైనా సరే కూటమి విజయం తథ్యమన్నారు.'అభ్యర్థుల వయసు, పార్టీకి అంకితభావంతో పాటు వారి చదువు, వ్యక్తిగత ప్రవర్తన లాంటి అన్ని విషయాలను పరిగణనలోకి అభ్యర్థులకు అవకాశం ఇచ్చాం. బూత్ కమిటీల నుంచి కుటుంబ సాధికార కమిటీలు ఉంటాయి. ఆ తరువాత బూత్ కమిటీ, పంచాయతీ కమిటీ, మండల కమిటీ, క్లస్టర్ కమిటీల అభిప్రాయాలు, ప్రతిపాదనలు తీసుకున్నాం. ఎమ్మెల్యేలు, జిల్లా నేతలు, ముఖ్యనేతల నుంచి వివరాలు తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశాం. జిల్లాలో నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి రియల్ టైం కోఆర్డినేట్ చేసుకున్నాం. మిత్రపక్షాలతో కోఆర్డినేషన్ కోసం ఓ కమిటీ ఏర్పాటు చేశాం. డిజిటల్ డేటాను ఇంటిగ్రేట్ చేసుకుని ఓ ప్రొఫైల్ క్రియేట్ చేసి విశ్లేషించాక, ఐవీఆర్ఎస్ తీసుకున్నాక వార్ రూమ్ క్రియేట్ చేశాం. అన్ని దశల్లో వివరాలు తీసుకున్నాకే అభ్యర్థులకే అవకాశం ఇచ్చాం. పార్టీకి కార్యకర్తలే బలం. బీసీలు టీడీపీకి కంచుకోటే. పార్టీని కాపాడి, అండగా నిలిచింది వాళ్లే. వారికి అధిక రిజర్వేషన్లు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాటం చేశాం. చివరగా మనం పార్టీ ద్వారా రిజర్వేషన్లు కల్పించాం. మహిళలకు పార్టీ పరంగా యాభై శాతానికి మంచి రిజర్వేషన్లు కల్పించాం. మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలు.. ఇలా బడుగు బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేశాం. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఇటీవల స్థానిక ఎన్నికల్లో మాకు 3.6 శాతం ఓట్లు పెరిగాయి. వైసీపీకి గతంలో వచ్చిన 39.8 శాతం నుంచి 6 శాతానికిపైగా ఓట్లు కోల్పోయిందిని'చంద్రబాబు వివరించారు.'కర్నూలు ఎంపీటీసీని ఎంపీగా చేశాం. ఏ పార్టీలో ఇలా జరగలేదు. 22 జెడ్పీ చైర్మన్లకుగానూ 12 మహిళలకు కేటాయించాం. 11 మంది మహిళలకు వైస్ ఛైర్‌పర్సన్లుగా అవకాశం ఇచ్చాం. జెడ్పీ చైర్మన్లు, చైర్‌పర్సన్లుగా మహిళా కార్యకర్తలకు అవకాశం ఇచ్చాం. ఓసీ స్థానంలో ఓ ఎస్సీ ఎంటెక్ మహిళకు అవకాశం ఇచ్చి గెలిపించుకున్నాం. పల్నాడులో సామాజిక న్యాయం కోసం జనరల్ మహిళకు బదులుగా యాదవ వర్గానికి చెందిన పుచ్చకాయల రమాదేవిని జిల్లా పరిషత్ చైర్మన్ చేశాం. తూర్పు గోదావరి జిల్లాలో పద్మిని పరిషత్ చైర్ పర్సన్ అయ్యారు. ఇలా చాలా చోట్ల చదువుకున్న వారితో పాటు వ్యక్తిగత ప్రవర్తన, సామాజిక న్యాయం లాంటివి పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యత కల్పించామని' టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు.



వైసీపీది విధ్వంసకర చరిత్ర అని విమర్శ

సాక్షి పత్రిక బాధ్యతారహితంగా వార్తలు రాస్తోందని, వైసీపీ తీరు రాష్ట్రానికి హాని చేసేలా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా విధ్వంసమే ఆ పార్టీ చరిత్ర అని, అందుకే దానిని "గొడ్డలి పార్టీ" అని పిలవాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.వైఎస్ షర్మిల కుమార్తె వివాహానికి తనను ఆహ్వానించడంపై సాక్షి పత్రికలో వచ్చిన కథనాల పట్ల చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇంటికి వచ్చి పెళ్లికి పిలిస్తే సొంత చెల్లిపైనే అసభ్యంగా రాస్తారా? షర్మిల తన కుమార్తె పెళ్లికి నన్ను పిలిచారు. దీనిపై ఇంత నీచపు రాతలు అవసరమా? రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరనే కనీస అవగాహన కూడా లేదా?" అని ఆయన ప్రశ్నించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకున్న స్నేహాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. "రాజశేఖరరెడ్డి, నేను మంచి స్నేహితులం. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ మా వ్యక్తిగత సంబంధాలు ఎన్నడూ చెడిపోలేదు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు షర్మిల, జగన్ ఇద్దరి పెళ్లిళ్లకూ నన్ను పిలిచారు, నేను హాజరయ్యాను. సంబంధాలను ఇంత దారుణంగా కించపరుస్తారా?" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రానికి పెట్టుబడులు రావడం చూసి వైసీపీ ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు.

రెండున్నరేళ్ల పాలనకు ప్రజల గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

విభేదాలు, వ్యక్తిగత పంతాలు, ఈగోలను పక్కనపెట్టి ఏకగ్రీవ ఎన్నికలకు కృషి చేయాలని స్పష్టం చేశారు.

ఏకగ్రీవ పంచాయతీలకు భారీ ప్రోత్సాహకాలు

గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైతే జనాభా ఆధారంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని సీఎం వెల్లడించారు. గతంలో గరిష్ఠంగా రూ.20 లక్షలుగా ఉన్న ప్రోత్సాహకాన్ని రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజలకు వివరించాలని మంత్రులు, పార్టీ నేతలకు సూచించారు. ఈ నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

గ్రామాల్లో ఐక్యతకు నేతలు చొరవ చూపాలి

గ్రామస్థాయిలో నాయకుల మధ్య పోటీలు, విభేదాలు అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదని చంద్రబాబు అన్నారు. గ్రామ ప్రజలందరితో చర్చించి ఏకాభిప్రాయంతో పంచాయతీలను ఏర్పాటు చేసుకునేలా ప్రయత్నించాలని సూచించారు. స్థానిక నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని గ్రామస్థాయి నేతలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని చంద్రబాబు ఆదేశించారు. ఏకగ్రీవ ఎన్నికల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, అందరి సహకారంతో ఎన్నికలు జరిగేలా చొరవ తీసుకోవాలని సూచించారు. రాజకీయ పోటీకి స్వస్తి పలికి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులు, పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు.

ఏపీలో నూతన మున్సిపల్ పాలకవర్గాల కొలువుదీరింపు నేడే!



-మొదటిపేజీ తరువాయి

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఐదేళ్ల పదవీకాలానికి నేటి నుంచే ప్రారంభం

చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నూతన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం తొలి సమావేశం జరిగిన తేదీ నుంచే ప్రారంభమవుతుంది. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లోని సెక్షన్ 7(1)(ఎ), ఏపీ మున్సిపాలిటీల చట్టం-1965లోని సెక్షన్ 20(1)(ఎ) ప్రకారం తొలి సమావేశం తేదీనే పదవీకాలం ప్రారంభమైన రోజుగా పరిగణిస్తారు. ఈ నిబంధనల మేరకు నవంబర్ 23న సమావేశాలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది.

13 కార్పొరేషన్లలో ప్రమాణ స్వీకారాలు

విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం నగరపాలక సంస్థల్లో తొలి సమావేశాలు జరగనున్నాయి. వీటితోపాటు రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ ఒకేరోజు సమావేశాలు నిర్వహించనున్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, ఛైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు చట్ట ప్రకారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక

ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నారు. చట్ట నిబంధనల ప్రకారం తొలి సమావేశంలో లేదా ఆ తేదీ నుంచి రెండు వారాల వ్యవధిలో ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 23నే ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్ఈసీ ఆదేశాలు

తొలి సమావేశాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సంబంధిత అధికారులను ఆదేశించింది. మున్సిపల్ కమిషనర్లు సమావేశాల నిర్వహణ, ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారం, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించింది.

ఐదేళ్ల పాటు స్థానిక పాలన

నవంబర్ 23 నుంచి బాధ్యతలు చేపట్టనున్న నూతన పాలకవర్గాలు వచ్చే ఐదేళ్ల పాటు పట్టణ స్థానిక సంస్థల పాలన కొనసాగించనున్నాయి. పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ పాలకవర్గాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసి పాలన ప్రారంభం కానుండటంతో పట్టణ ప్రజల్లో కొత్త పాలకవర్గాలపై ఆశలు నెలకొన్నాయి.

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

-మొదటిపేజీ తరువాయి



యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలను రప్పించే ప్రయత్నం చేస్తుంటే, గత పాలకులు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని, ఆ తర్వాత మళ్లీ ప్రాజెక్టుల క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి సంబంధించిన పారిశ్రామిక ప్రగతి వివరాలను మంత్రి పంచుకున్నారు. అందులో గూగుల్ (రూ. 1,33,000 కోట్లు), ఏఎం/ఎన్ఎస్ ఇండియా (రూ. 1,36,000 కోట్లు), బ్రూక్‌ఫీల్డ్ (రూ. 1,06,000 కోట్లు), రిలయన్స్ (రూ. 43,000 కోట్లు), రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో (కమిషన్డ్, నిర్మాణంలో, ఆపరేషనల్) ఉన్నట్లు ఆ జాబితాలో చూపించారు. ఈ వివరాలను ప్రస్తావిస్తూ.. "ఇది మా ట్రాక్ రికార్డ్. పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు రాష్ట్ర అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.

కొత్త భల్లు గూడ బరిలో యువ కెరటం

సర్పంచ్ అభ్యర్థిగా గొల్లోరి మహాదేవ్ నామినేషన్

అరకులోయ మండల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన మహాదేవ్ నామినేషన్‌భారీ జనసందోహం, కోలాహలం మధ్య నామినేషన్ దాఖలు పంచాయతీలో బలమైన పట్టు.. యువత, మహిళలు, పెద్దల మద్దతుతో కదం తొక్కిన నాయకుడుకొత్త భల్లుగుడ సమగ్రభివృద్ధే అజెండాగా ఎన్నికల శంఖారావం



అరకు వేలి నవంబర్ 22 మీ వార్తా న్యూస్,,,గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ అరకులోయ మండలంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మండలంలోని కీలకమైన కొత్త భల్లుగుడ పంచాయతీ సర్పంచ్ పదవికి బలమైన యువ నాయకుడు, ప్రజల్లో విశేష గుర్తింపు ఉన్న గొల్లోరి మహాదేవ్ ఆదివారం అత్యంత వైభవంగా తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ ర్యాలీ కి పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు, యువత, మహిళలు కనీవినీ ఎరుగని రీతిలో తరలిరావడంతో కొత్త భల్లుగుడలో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

ప్రత్యర్థుల శిబిరాల్లో మొదలైన గుబులు కొత్త భల్లుగుడ పంచాయతీలోని ప్రతి కుటుంబంతో ఆత్మీయ అనుబంధం కలిగి ఉండి, ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందుండి ఆదుకునే నాయకుడిగా గొల్లోరి మహాదేవ్ కు ప్రత్యేక గుర్తింపు ఉంది. పంచాయతీ రాజకీయాల్లో బలమైన పట్టు, క్షేత్రస్థాయిలో తిరుగులేని బలం ఉన్న మహాదేవ్ స్వయంగా బరిలోకి దిగడంతో ఇతర అభ్యర్థుల శిబిరాల్లో ఇప్పటి నుంచే గుబులు మొదలైంది. నామినేషన్ రోజునే ఆయనకు లభించిన అనూహ్య ప్రజాదరణ చూసి ప్రత్యర్థి వర్గాలు అయోమయంలో పడ్డాయి. గెలుపు గుర్రం ఎవరో ఇప్పుడే తేలిపోయిందంటు స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.

పండుగ వాతావరణంలో నామినేషన్ ఘట్టం

ఉదయం నుంచే కొత్త భల్లుగుడ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.డప్పు వాయిద్యాలు, జై మహాదేవ్ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. గ్రామ పెద్దల ఆశీర్వాదం తీసుకున్న అనంతరం, భారీ ర్యాలీగా వెళ్లి ఎన్నికల అధికారికి మహాదేవ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అభివృద్ధే నా ఊపిరి గొల్లోరి మహాదేవ్ నామినేషన్ దాఖలు అనంతరం గొల్లోరి మహాదేవ్ మీడియాతో మాట్లాడుతూ కొత్త భల్లుగుడ పంచాయతీ ప్రజల నమ్మకం, వారి ఆశీస్సులే నా అసలైన బలం.అరకులోయ మండలంలోనే మన పంచాయతీని అన్ని రంగాల్లో నంబర్ వన్గా ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా ఏకైక లక్ష్యం.యువతకు అండగా నిలుస్తూ, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అహర్నిశలు కృషి చేస్తాను. ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు ఈ నామినేషన్ కార్యక్రమంలో కొత్త భల్లుగుడ పంచాయతీ పరిధిలోని గ్రామ పెద్దలు, కుల పెద్దలు, యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, మహాదేవ్ అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మహాదేవ్ విజయం ఖాయమంటు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

అల్లూరు గెలుపే లక్ష్యం

ప్రతి వార్డులోనూ స్వయంగా ప్రచారం చేస్తా: మంత్రి నారాయణ

నెల్లూరు జిల్లా అల్లూరు నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి)

అల్లూరు రూపురేఖలు మారుస్తాం.. కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించండి: మంత్రి నారాయణ పిలుపు అల్లూరు బాధ్యత నాదే.. సకల మౌలిక సదుపాయాలతో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: మంత్రి నారాయణ.2028 నాటికి నెల్లూరుతో సమానంగా అల్లూరు అభివృద్ధి: మంత్రి నారాయణ భరోసా.అల్లూరుకు ఇప్పటికే 47 కోట్ల నిధులు.. నెలకు ఒకసారి నేనే వచ్చి పర్యవేక్షిస్తా: మంత్రి నారాయణ.అల్లూరు నగర పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ కూటమి చైర్మన్ అభ్యర్థి తోటకూర సునీల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి నారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అల్లూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర,



ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిలతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తానే స్వయంగా ప్రతి వార్డులో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుండి నడిపిస్తానని స్పష్టం చేశారు. అల్లూరు అభివృద్ధికి ఇప్పటికే 47 కోట్ల నిధులు మంజూరు చేశామని, 2028 జూన్ నాటికి నాణ్యమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్కులు, పాఠశాలలు వంటి సకల మౌలిక సదుపాయాలతో నెల్లూరుతో సమానంగా అల్లూరును కూడా సమగ్రాభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా నెలకు ఒకసారి కచ్చితంగా అల్లూరుకు వచ్చి పనులను పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చిన మంత్రి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి అభ్యర్థిని చారిత్రాత్మక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

మచిలీపట్నంలో భగవద్గీత పోటీలు ఘనంగా నిర్వహణ

విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు.

మచిలీపట్నం నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి)

మచిలీపట్నంలోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భగవద్గీత పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం మరియు నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దలు, మహిళల వరకు వివిధ వయస్సుల వారు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీ వడ్డి చిరంజీవి, శ్రీ రమణ, శ్రీ గుండు రమేష్ గార్ల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

పోటీల విజేతల వివరాలు

గ్రూప్ -- 1: ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి వరకు
ప్రథమ బహుమతి: మోటేపల్లి లక్ష్మీ నాగ ప్రియ
ద్వితీయ బహుమతి: ఎన్. శరణ్య
తృతీయ బహుమతి: బి. శశి మణికంఠ

గ్రూప్ -- 2: 4వ తరగతి నుంచి 7వ తరగతి వరకు
ప్రథమ బహుమతి: సామిరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి
ద్వితీయ బహుమతి: ప్రత్తిపాటి కారుణ్య
తృతీయ బహుమతి: అహమదే అహ్మది

గ్రూప్ -- 3: 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు
ప్రథమ బహుమతి: ఎస్. సాయి రిషిత్
ద్వితీయ బహుమతి: వి. విన్యశ్రీ
తృతీయ బహుమతి: సిహెచ్. శ్రీ సాయి అరుణ్ కుమార్

గ్రూప్ -- 4: పెద్దలు మరియు మహిళలు
ప్రథమ బహుమతి: పల్నాటి అరుణ కుమారి
ద్వితీయ బహుమతి: అద్దంకి హిరణ్మయి
తృతీయ బహుమతి: మోటేపల్లి మేఘన

ప్రముఖుల అభినందనలు

ఈ కార్యక్రమంలో శ్రీ అంబటి కాంతారావు, శ్రీ వుండత్తు శ్రీనివాసరావు, శ్రీ ప్రభాకరరావు, శ్రీ కోట శ్రీకాంత్, శ్రీ వర్రె రాజశేఖర్ (కార్యదర్శి), శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం (కార్యాలయ ప్రముఖ్), శ్రీమతి వసుంధర (దుర్గావాహిని ప్రముఖ్), శ్రీమతి శైలజ (మాతృశక్తి ప్రముఖ్), శ్రీ తురగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి శ్రీ పి.వి.ఎస్. నాయుడు కార్యక్రమ నిర్వాహకులను, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను, పెద్దలను ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ, భగవద్గీత కేవలం ఒక ఆధ్యాత్మిక గ్రంథం మాత్రమే కాదని, మానవ జీవితానికి మార్గదర్శకమైన అమూల్యమైన జ్ఞాననిధి అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే భగవద్గీతలోని సందేశాలను తెలుసుకోవడం ద్వారా ధర్మబద్ధమైన ఆలోచన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, కర్తవ్యనిష్ఠ, నైతిక



విలువలు అలవడతాయని తెలిపారు.
నేటి యువతకు విద్యతో పాటు సంస్కారం, ఆధ్యాత్మిక చింతన, దేశభక్తి కూడా అవసరమని, భగవద్గీత వంటి మహోన్నత గ్రంథాల ద్వారా భావితరాలకు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ వారసత్వాన్ని అందించవచ్చని అన్నారు.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొనేలా ఇటువంటి పోటీలను నిర్వహించడం ద్వారా కుటుంబ స్థాయి నుంచే ధార్మిక చైతన్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం పట్ల గౌరవభావం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను కృష్ణా జిల్లావ్యాప్తంగా మరింత విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మల్లేశ్వరం కూటమి సర్పంచ్ అభ్యర్థిగా చెన్ను లక్ష్మీ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు



బంటుమిల్లి నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి) బంటుమిల్లి మల్లేశ్వరం గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా చెన్ను లక్ష్మీ శ్రీనివాస్ ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు, మరియు గ్రామ పెద్దలతో ర్యాలీగా వచ్చి చెన్ను లక్ష్మీ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని చెన్ను లక్ష్మి పత్రిక ముఖంగా తెలియజేశారు.

గూడూరు ముక్కొల్లు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సమ్మెట రమ్య నామినేషన్



గూడూరు నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండలం ముక్కొల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ కూటమి అభ్యర్థిగా పిఎసిఎస్ చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ (నాని) సతీమణి సమ్మెట రమ్య ఎలక్షన్ అధికారి కి నామినేషన్ దాఖలు చేశారు... ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ అభిమానులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అయినవిల్లి వారి వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు.

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 22



ఆలమూరు ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి జరిగిన అయినవిల్లి సత్తిబాబు గౌడ్, లక్ష్మితులసి దంపతుల జేష్ఠ కుమారుడు కుమార్ సాయి గౌడ్, నాగజ్యోతి వివాహ వేడుక వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు హాజరయ్యి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ చల్లా నానాజీ, చల్లా భూషణం, ఎలుగుబంట్ల సాయిబాబు, ఎలుగుబంట్ల బూరయ్య,ఆలమూరు మండల కాపు సంఘం అధ్యక్షులు గొర్రిపూడి పెదకాపు,డిపిరావు,వెత్సా శ్రీనివాస్, ఎరుకొండ గణేష్, లంకే వెంకటరెడ్డి, నార్ని వీరబాబు, నార్ని సెంథిల్ కుమార్, పాకా శ్రీను (పాస్టర్), పాకా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రచారంలో దూసుకుపోతున్న కప్పలదొడ్డి స్వతంత్ర అభ్యర్థి మేడక రాజలింగం



గూడూరు నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండల పరిధిలోని కప్పల దొడ్డి గ్రామపంచాయతీ స్వతంత్ర అభ్యర్థిగా మేడక రాజలింగం నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలో వీరి తండ్రి గత కొన్ని సంవత్సరాలుగా ప్రాథమిక వైద్యం అందించినటువంటి ఘనత వీరి కుటుంబానికి ఉన్నది అనంతరం ఈ స్వతంత్ర అభ్యర్థి ప్రాథమిక వైద్య సేవలు ఉచితంగా చేస్తానంటూ ముందుకొచ్చి గ్రామస్తులందరిని కలుపుకుంటూ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలన్నిటిపై పోరాడుతానని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కట్ట నాగేశ్వరరావు మెడక శంకర్రావు ,పేరు శెట్టి వెంకటేశ్వరరావు పేరు శెట్టి నాంచారయ్య, బల్ల నాగేశ్వరావు, బుసం తాతారావు, మేడక బాబు తదితరులు పాల్గొన్నారు

ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి కోట హనుమంతురావు

ప్రజలు నుండి విశేష స్పందన....అడుగడుగునా బ్రహ్మరథం







అంబాజీపేట, నవంబర్ 19 (మీ వార్త విలేఖరి): ఇరుసుమండ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కోట హనుమంతురావు ఎన్నికల ప్రచారం లో దూసుకుపోతున్నారు. ప్రచారంలో దారి పొడవునా ప్రజల నుంచి ఆయనకు విశేష స్పందన లభిస్తుంది . ఇంటింటికి వెళ్లి అవ్వా, తాత, అమ్మ అక్క, అన్నా అంటూ పాటు ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం వాటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నుండి ఆయనకు విశేష స్పందన లభించింది. మహిళలు కూడా అయనకు అండగా నిలుస్తున్నారు. కోట గెలుపు తో గ్రామాభివృద్ధి సాధ్యమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.పార్టీలకు అతీతంగా అయనకు పలువురు మద్దత్తు తెలిపారు. ముఖ్యంగా యువత అయన గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి మంత్రి నారాయణ ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు



నెల్లూరు జిల్లా కోవూరు నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి) నిండు నూరేళ్లు వర్ధిల్లాలి.. ప్రశాంతి రెడ్డికి మంత్రి నారాయణ ఆశీస్సులు.ప్రజాసేవలో మరింత ఎదగాలి.. ప్రశాంతి రెడ్డికి మంత్రి నారాయణ శుభాకాంక్షలు.కోవూరు శాసనసభ్యులు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి జన్మదినం సందర్భంగా నెల్లూరు ఎంపీ కార్యాలయంలో సందడి నెలకొంది. ఈ ప్రత్యేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ గారు నెల్లూరులోని వేమిరెడ్డి ఎంపీ కార్యాలయానికి స్వయంగా విచ్చేసి, ప్రశాంతి రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు భారీ పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించడంతో కార్యాలయ ప్రాంగణం అంతా కోలాహలంగా మారింది.?ప్రజాసేవ పట్ల ప్రశాంతి రెడ్డి గారికి ఉన్న నిబద్ధతను కొనియాడుతూ, భగవంతుని ఆశీస్సులతో ఆమెకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని మంత్రి నారాయణ గారు ఆకాంక్షించారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధిలోనూ, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా భక్తుల సేవలోనూ ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) దేశ హితం కోసం విద్య ,విద్యాహితం కోసం ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయుని హితం కోసం సమాజం అనే ముఖ్య ఉద్దేశం తో ఏర్పడినదే ఈ ఏపీయుఎస్ సంఘమని, ఏపీ యూఎస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి చిన్ని చిరంజీవి శ్రీనివాస్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా శాఖ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీ యుఎస్) నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అదనపు కార్యదర్శి చిన్ని చిరంజీవి శ్రీనివాస్, ఉమ్మడి విశాఖ జిల్లా సంఘటన కార్యదర్శి గడ్డి పాంగి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11. 30 గంటలకు పాడేరు లోని బీపీకే పాఠశాల వద్ద అల్లూరి జిల్లా ఏపీ యుఎస్ జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దేశ హితం కోసం విద్యా,విద్యా హితం కోసం ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయిని హితం సమాజం అనే నినాదంతో ఏర్పడిన దే ఈ సంఘం అని, ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా భారతదేశ సంస్కృతి,సాంప్రదాయాలను పరిరక్షించడంలో.ఏపీ యూఎస్. ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాష్ట్ర అదనపు కార్యదర్శి చిన్ని చిరంజీవి పేర్కొన్నారు. చదువు చెప్పడం, వేతనం పుచ్చుకోవడం మాత్రమే కాకుండా, చదువు చెప్పడం అనేది గొప్ప జ్ఞాన దాన యజ్ఞంగా ఉపాధ్యాయులు భావించాలని ,ఉమ్మడి విశాఖ జిల్లా సంఘం కార్యదర్శి గడ్డి పాంగి అప్పారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కేవలం రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహాసంఘ్. అనుబంధంగా ఉంటూ దేశవ్యాప్తంగా ఒకే రకమైన పని విధానము ,ఒకే రకమైన వేతన విధానము, మరియు ఒకే రకమైన సిలబస్ ఉండాలని, ప్రయత్నం చేస్తూ ఉన్నదనీ. దీనికోసం దేశంలోని వివిధ రాష్ట్రాలలో అనేక సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన సంఘం సభ్యులైన అల్లూరి జిల్లా ఏపీ యుఎస్. అధ్యక్షులుగా కొండపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సాగిన వెంకటరావు, జిల్లా సహా అధ్యక్షులుగా సాగిన సత్యనారాయణ,ఆర్థిక కార్యదర్శిగా బద్నాయిని గంగరాజు, గౌరవ అధ్యక్షులుగా తుడుం బాబురావు, నియమితులయ్యారని అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించడం జరిగినదనీ తెలిపారు..

యండపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి మహా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థినీ పిన్నెంటి రాజ్యలక్ష్మి రత్తయ్య నామినేషన్...



కృత్తివెన్ను నవంబర్ (22 మీ భర్త ప్రతినిధి) కృత్తివెన్ను 22 - 11 - 2026 మండలంలోని యండపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ సూచించిన మహా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థినీ పిన్నెంటి రాజ్యలక్ష్మి రత్తయ్య తన రెండు సెట్లా నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారులకు అందించారు. అలాగే పంచాయతీ వార్డ్ మెంబెర్స్ గా పోటీలో ఉన్న ఎనిమిది మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సైతం ఎన్నికల అధికారులకు అందించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేసి అనంతరం భారీ ప్రజా సందోహంతో నామినేషన్ కార్యక్రమం ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కాగిత కృష్ణా ప్రసాద్ లు తనపై పెట్టుకున్న నమ్మకం నిలుపుకుంటానని 24 / 7 ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామ అభివృద్ధి కీ కృషి చేస్తానని, గ్రామంలో కుల, మతాలకు, బీద, ధనిక బేధం లేకుండా అందరికి మహా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందేలా చూస్తానని అన్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో మహా కూటమి నాయకులు గరికపాటి శివ, కూనసాని చిన్న, పిన్నెంటి రత్తయ్య, పిన్నెంటి రాంబాబు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.....

కూటమి ప్రభుత్వానికి చరమ గీతం పాడండి



సీపీఐ అభ్యర్థిని గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

కాకినాడ, నవంబర్ 22 న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)ప్రజలపై భారాలు మోపుతూ, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలపై ప్రజలు గళమెత్తాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక 10 వ డివిజన్ లో ప్రచారం నిర్వహించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని విమర్శించారు. మరోవైపు ఇంటి పన్నులు పెంచుతూ ప్రజలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నారని పేర్కొన్నారు. పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నప్పటికీ, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని అన్నారు.ముఖ్యంగా పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, వీధుల్లో చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ అభ్యర్థికి ప్రజలు మద్దతు తెలపాలని, స్థానిక సంస్థల్లో ప్రజల సమస్యలను ప్రతిధ్వనించే గొంతుకగా సీపీఐ అభ్యర్థిని గెలిపించాలని అక్కినేని వనజ విజ్ఞప్తి చేశారు. ప్రజలపై భారాలు తగ్గించడం, పన్నుల భారం నియంత్రించడం, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పట్టణాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు , వైఎస్సీపీ నాయకులు హేమంత్, సత్య, ప్రసన్న, శ్రీనును, కమల్ భాషా, మాజీ కౌన్సిలర్ గౌస్ సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సత్యనారాయణ మడగల రమణ తదితరులు పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య





రాజోలు, నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి):నియోజకవర్గ పరిధిలోని పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్ డి ఏ కూటమి సర్పంచ్ అభ్యర్థులకు మద్దత్తుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి పామర్తి రమణ కు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజోలు గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ త్రాగునీరు ,శానిటేషన్, రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా తన వంతు సహాయ సహకారాలు పామర్తి రమణ కు అందిస్తానని ఉంగరం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అమూల్య ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, కోళ్ల వెంకన్న, శ్రీమతి మోకా పార్వతి, శ్రీమతి మట్టపర్తి లక్ష్మి, శ్రీమతి కోటిపల్లి, శ్రీమతి చింతపల్లి నాగలక్ష్మి రత్నమాల, నార్కెడుమిల్లి కనకం, భలం మరియు ఇతర కూటమి నాయకులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

నునుసురాళ్ల సర్పంచ్ అభ్యర్థిగా కుశినేని రవి నామినేషన్ దాఖలు

టీడీపీ మద్దతుతో బరిలోకి.. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు



తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండల పరిధిలోని నునుసురాళ్ల గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. నునుసురాళ్ల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ తరఫున బలపరిచిన నల్లగుండ్ల గ్రామానికి చెందిన కుశినేని రవి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన నామినేషన్ పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు హాజరై కుశినేని రవికి తమ మద్దతు తెలియజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల బరిలో నిలిచినట్లు ఈ సందర్భంగా ఆయన మద్దతుదారులు పేర్కొన్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రంగారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, నీటి సంఘం ఉపాధ్యక్షులు మద్దిలేటి, మునేశ్వర్ గౌడ్, తలారి చంద్ర, కె. మోహన్, మహేష్ గౌడ్, ఎల్లా గౌడ్, రాముడు తదితరులు పాల్గొన్నారు. కుశినేని రవి నామినేషన్ దాఖలు చేయడంతో నునుసురాళ్ల గ్రామపంచాయతీ ఎన్నికల రాజకీయ వాతావరణం మరింత ఆసక్తికరంగా మారింది.

శభాష్ పురం సర్పంచ్ అభ్యర్థిగా బోయ సుధారాణి నామినేషన్ దాఖలు



తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండల పరిధిలోని శభాష్ పురం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు బోయ మోహన్ సతీమణి బోయ సుధారాణి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శభాష్ పురంలోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఎన్నికల అధికారులను కలిసి తన నామినేషన్ పత్రాలను అధికారికంగా సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. నామినేషన్ దాఖలుతో శభాష్ పురం గ్రామంలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. గ్రామంలో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి అంశాలపై ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆమె సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. బోయ సుధారాణి నామినేషన్ దాఖలు చేయడంతో శభాష్ పురం గ్రామ పంచాయతీ ఎన్నికలపై గ్రామస్థుల్లో ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికల పరిణామాలతో గ్రామంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, తలారి శ్రీరాములు, సోమశేఖర్ గౌడ్, సుధాకర్ గౌడ్, వెంకట్రాముడు, తలారి ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కెళ్ల సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ తరఫున పెద్ద అటక పెద్ద మునియప్ప నామినేషన్ దాఖలు

తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండలం పరిధిలోని ముక్కెళ్ల గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంది. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పెద్ద అటక పెద్ద మునియప్ప ఆదివారం తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. మారెళ్ల స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఎన్నికల అధికారుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ఆయనకు మద్దతుగా తరలివచ్చారు. పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో గ్రామంలో రాజకీయ వాతావరణం నెలకొంది. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి రామచంద్ర, అరవ లక్ష్మి స్వామి, ఉడంపాటి కిష్టన్న, ఉడంపాటి నాగేష, కుసుమేని మునియప్ప, మాజీ ఎంపీటీసీ తరికి నారాయణ, అరవ బాలముని అప్ప, చిల్లబోని పెద్ద వెంకటేష్, కురువ కేశన్న, కురువ పెద్ద వెంకటేష్, ఉప్పర తిమ్మయ్య, ఉప్పర మల్లికార్జున, వడ్ల హరి తదితరులు పాల్గొన్నారు. ముక్కెళ్ల గ్రామపంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరఫున పెద్ద అటక పెద్ద మునియప్ప బరిలో నిలవడంతో గ్రామంలో ఎన్నికల సందడి మరింత పెరిగింది.

కుక్కునూరు మండలం శ్రీధర్ గ్రామంలో గీత కార్మికుడికి ప్రమాదం



కుక్కునూరు నవంబర్ 22(మి వార్తా ప్రతినిధి) కుక్కునూరు మండలం శ్రీధర్ గ్రామంలో నేడు వృత్తి నిమిత్తం తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు వెంకటనారాయణ అక్కడి నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన నడుముకు బలమైన గాయమైంది.స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా ఆయనను బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించగా నడుము వద్ద ఓ ఎముకకు బలమైన గాయమైనట్టు వైద్యులు గుర్తించారు. దీంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మర్రివేముల సర్పంచ్ అభ్యర్థిగా "కర్రావుల '



పుల్లలచెరువు, నవంబర్ 22 (మీ వార్త) మండలంలోని మర్రివేముల సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి కర్రావుల అప్పమ్మ వెంకయ్య ఆదివారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో మొదట గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ ఆఫీసులో కార్రావుల అప్పమ్మ వెంకయ్య నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. మర్రివేముల పంచాయతీలో కర్రావుల కుటుంబానికి విశేషమైన అనుబంధం ఉంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా కర్రేవుల కుటుంబం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడేవారు. ఈ నేపథ్యంలో కర్రావుల నామినేషన్ వేయడం పట్ల మర్రివేముల పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి గెలుపు పక్కా కాయం అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం గా ఉంది.

నవంబర్ 3వ తేదీ నుంచి అభివృద్ధి ప్రారంభం

బి సర్పంచి అభ్యర్థి వీర్నాల ఆదిలక్ష్మి

గూడూరు నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి) ప్రజలు ఆశీర్వదించి గెలిపించిన వెంటనే పంచాయతీలోని సమస్యలకు పరిష్కరించే దిశగా పనిచేస్తానని గూడూరు మండలం కోక నారాయణ పాలెం పంచాయతీ ఇండిపెండెంట్ అభ్యర్థి వీర్నాల ఆదిలక్ష్మి ఆదివారం ప్రకటించారు. అధికారం కోసం కాదని అభివృద్ధి కోసమేనని ఈ సందర్భంగా ఓటర్లకు ఆమె వివరించారు. పేదలకు సేవ చేసే భాగ్యం కల్పిస్తే ఊపిరి ఉన్నంతవరకు కష్ట నష్టాల్లోనూ తోడుంటానని ఎలాంటి సమస్య అయినా పరిష్కరించి వెన్నుదన్నుగా నిలుస్తానని ఆమె చెప్పారు. అంతేకాకుండా స్వచ్ఛంద సేవ పేరుతో పదేళ్లుగా పరిసర ప్రాంతాల్లో ఎంతో మందికి సహాయం చేశామన్నారు అంతే కాకుండా ప్రజలు తనను గెలిపిస్తే ఈ ఐదేళ్లలో పంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన చేసేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమయ్యే త్రాగునీరు రోడ్లు డ్రైనేజీ విద్యుత్ విద్య అలాగే అతివృష్టి అనావృష్టి కారణంగా ఇబ్బంది పడే ప్రతి ఒక్కరికి తాము తోడైయుండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇట్లాంటి సేవ కార్యక్రమాలు చేసే అదృష్టాన్ని పంచాయతీ ప్రజలు తనకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో సర్పంచ్ అభ్యర్థిగా బిజ్జె వీణ నామినేషన్ దాఖలు



తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండల పరిధిలోని మారెళ్ళ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా బిజ్జె బాల రంగస్వామి యాదవ్ సతీమణి బిజ్జె వీణ ఆదివారం మారెళ్ళ స్వర్ణ గ్రామ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికల బరిలో నిలిచారు. బిజ్జె వీణ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల హాజరుతో నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పి. రామాంజనేయులు, మంకె లింగన్న, ఘన మద్దిలేటి, సీపీఐ నాయకులు చదువుల కాశీ, మంకె నరేంద్ర, పల్లె మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు బిజ్జె వీణకు మద్దతుగా కార్యక్రమంలో పాల్గొని నామినేషన్ దాఖలులో భాగస్వాములయ్యారు.

ఆకుమర్రు గ్రామపంచాయతీ వైయస్సార్ పార్టీ సర్పంచ్ అభ్యర్థినిగా నామినేషన్ దాఖలు చేసిన శ్రీమతి బొల్లా నాగలక్ష్మి



గూడూరు నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండల పరిధిలోని ఆకుమరు గ్రామ సర్పంచ్ అభ్యర్థినిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి పెడన నియోజవర్గ ఇంచార్జ్ ఉప్పల రాము బలపరిచిన బో ల్ల నాగలక్ష్మి కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో కార్లు, బైకులతోభారీ ర్యాలీగా రాయవరం లోని సచివాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

అట్టహాసంగా స్నేహలత నామినేషన్!

వైసీపీ ఎన్నికల సమర శంఖం

వైఎస్ఆర్ సెంటర్ నుంచి భారీ ర్యాలి



పుల్లలచెరువు, నవంబర్ 22 (మీ వార్త) పుల్లలచెరువు గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ వైసీపీ ఎన్నికల సమరానికి శ్రీకారం చుట్టింది. సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ మద్దతుతో కొర్లకుంట స్నేహలత ఆదివారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ఉత్సాహభరితంగా నిర్వహిస్తూ గ్రామంలో ఎన్నికల సందడిని నెలకొల్పాయి. బస్టాండ్ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వైసీపీ కార్యకర్తలు, యువత, మహిళలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగుతూ పంచాయతీ కార్యాలయానికి చేరుకుంది. కార్యకర్తలు నినాదాలతో అభ్యర్థికి మద్దతు తెలుపుతూ ఎన్నికల వాతావరణాన్ని హోరెత్తించారు. అనంతరం స్నేహలత ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమదైన వ్యూహాలతో ముందుకు సాగుతుండగా, స్నేహలత నామినేషన్ కార్యక్రమం వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. గ్రామంలో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారుతోంది.

గూడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకూరి శ్రీనివాస్



గూడూరు నవంబర్ 22(మీ వార్త ప్రతినిధి) గూడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైయస్సార్ పార్టీ తరఫున పోటీ చేయుచున్న ఆకురి శ్రీనివాస్, మాజీ ఎంపిపి సంఘ మధుసూదన్ రావు వేముల సురేష్ రంగబాబు వైఎస్ఆర్ పార్టీ గ్రామ కన్వీనర్ లింగం విజయకుమార్, బత్తిన స్వామి,వైఎస్ఆర్ పార్టీ 14వ వార్డు సభ్యులుగా పోటీ చేయుచున్న అట్లూరి వెంకటేశ్వరరావు ఇతర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రచారం చేయుచున్నారు

సర్పంచ్ అభ్యర్థి గా ప్రసన్న నామినేషన్

వై పాలెం, వినుకొండ నియోజకవర్గాల జనసేన సమన్వయకర్తలు హాజరు

బస్టాండ్ సెంటర్ లో భారీ ర్యాలీ





పుల్లలచెరువు, నవంబర్ 22 (మీ వార్త) మండల కేంద్రమైన పుల్లలచెరువు సర్పంచ్ అభ్యర్థిగా జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థి దాసి ప్రసన్న ఆదివారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. యర్రగొండపాలెం, వినుకొండ నియోజకవర్గాల జనసేన పార్టీ సమన్వయకర్తలు చీకటి వంశీ దీప్, నిశ్శంకరరావు శ్రీనివాసరావు లు, మరియు పుల్లలచెరువు మండల జడ్పిటిసి సభ్యులు కొఠారి అచ్చయ్య ల ఆధ్వర్యంలో ప్రసన్న నామినేషన్ కార్యక్రమం అత్యంత కోలాహలంగా జరిగింది. మొదట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు " జై పవన్ కళ్యాణ్", "జై జనసేన ", " ఆర్మీ బుజ్జి " నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలతో బస్టాండ్ సెంటర్ మార్మోగిపోయింది. ర్యాలీ అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అభ్యర్థి ప్రసన్న నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

?ఎంపీని కలిసిన కొత్త కార్పొరేటర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు.

నూతన ప్రజాప్రతినిధులతో సందడిగా మారిన ఎంపీ కార్యాలయం.

ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ఎంపీ శుభాకాంక్షలు.

ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ హితవు.





ఏలూరు, నవంబర్ 22:లి ఏలూరు నగరపాలక సంస్థకు నూతనంగా ఎన్నికైన పలువురు కార్పొరేటర్లు, వివిధ మండలాలకు చెందిన నూతన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆదివారం ఉదయం ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారి భవిష్యత్ ప్రజా జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తమపై ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులకు పదవులు అనేవి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశాలని, ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ మంచి పేరు సంపాదించుకోవాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో క్రమశిక్షణ, అంకితభావం, ప్రజల పట్ల బాధ్యతతో ముందుకు సాగితే మరింత ఉన్నత స్థానాలను చేరుకునే అవకాశం ఉంటుందని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఉదయం నుంచే ఏలూరులోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయానికి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎంపీ కార్యాలయం సందర్శకులతో కిక్కిరిసిపోయి సందడిగా మారింది. పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీని కలిసి తమ పరిచయాలను తెలియజేయడంతో పాటు, మర్యాదపూర్వకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన, భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు నూతన కార్పొరేటర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వివిధ పార్టీలకు చెందిన నూతన ప్రజాప్రతినిధులు ఎంపీని మర్యాదపూర్వకంగా కలవడం ఈ సందర్భంగా ప్రత్యేకతగా నిలిచింది. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సంక్షేమం, స్థానిక ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా అందరూ బాధ్యతతో పనిచేయాలని ఆకాంక్షించారు.

మానవతా సేవలు అభినందనీయం

పెంటపాడు నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి)
మానవతా సేవలు అభినందనీయం అని పలువురు వక్తలు ప్రశాంశించారు. ఆదివారం మానవత నెలవారీ సమావేశం ఆదివారం బోడపాడు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మండపంలో మండల అధ్యక్షులు రాంబరికెల రాజ్ కుమార్ అధ్యక్షత నిర్వహించారు. అంతర్జాతీయ ప్రముఖ మృదంగ విద్వాంసులు సరస్వతుల హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. నెలవారీ సమీక్షలో భాగంగా ఈ నెలలో పెంటపాడు గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ స్కూల్ అభ్యర్థన మేరకు 1500 లీటర్ల వాటర్ ట్యాంకర్ నిర్మాణానికి రూ.15 వేలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇటీవల వరద బాధితుల నిమిత్తం బోడపాడు గ్రామంలో ఆశ్రయం పొందిన వరద బాధితులకు భోజన సదుపాయాలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మానవత జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు ప్రస్తుతం స్వీడన్ దేశ పర్యటనలో ఉన్నందున వారి సూచన మేరకు ఈ నవంబర్ నెలవారీ సమావేశాన్ని బోడపాడు గ్రామంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటువంటి సమావేశాల వల్ల గ్రామీణ ప్రాంతాలకు మానవత చేస్తున్న సేవలు ప్రాచుర్యం పొందే అవకాశం ఉందని అన్నారు. సమావేశానికి 32 మంది మానవత సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యవర్గ సభ్యులు మీసల సత్యనారాయణ, పారాడి పాల్, నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, విప్పర్తి వినాయకుడు, ఏలూరు వీరస్వామి, కోర్లపర కోటేశ్వరరావు, కాకర్ల జయరాజు మరియు స్థానిక పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



కొత్తలంక గ్రామాభివృద్ధికి కృషి చేస్తా....

అభివృద్ధి, సంక్షేమంలో మొదటి స్థానం లో నిలుపుతా...

ప్రజలు మద్దత్తు తో విజయం సాధిస్తా....

సర్పంచ్ అభ్యర్థి దాసరి సుమలత సాయిబాబు

ముమ్మిడివరం, నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి):
కొత్తలంక గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి దాసరి సుమలత తెలిపారు. ప్రజలందరి సహకారం తో కచ్చితంగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2013-2018 లో ప్రజలందరూ నాపై నమ్మకంతో సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ప్రజల సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కొత్తలంక గ్రామాన్ని ప్రథమ స్థానం లో నిలిపానని అన్ని హంగులతో నూతన పంచాయతి భవనం నిర్మించడం తో పాటు పాడి రైతుల కోసం గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటు చేశానన్నారు గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు, రెండు ఎం.పి.పి. ఎలిమెంటరీ స్కూల్ భవనములు నిర్మించడం తో పాటు ప్రజల అవసరాల దృష్ట్యా ఇంటింటికి మురుగుదొడ్లు నిర్మించడం, ఎల్.ఇ.డి. బల్బులతో కొత్తలంక గ్రామమంతా వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధుల నుండి గ్రామంలో సుమారు 6.50 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించడం జరిగిందని, పాడి వీధి నుండి చాకిరేవు చెరువు వెళ్ళే మార్గం సిమెంట్ రోడ్డు, పుష్కర నిధులతో 30 లక్షలతో పుష్కర గాట్, మరియు గాట్ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. ప్రచారంలో భాగంగా ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తానని ఎమ్మెల్యే బుచ్చిబాబు సహకారంతో గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించి విద్య వైద్య ఉపాధి రంగాల్లో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. గ్రామంలో డ్రైన్ సమస్య పరిష్కరిస్తానని విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తానన్నారు. ప్రచారంలో గ్రామ ప్రజల నుండి ఆమెకు విశేష మద్దతు లభిస్తుంది. పార్టీలు అతీతంగా ముందుకు వచ్చి ఆమెకు మద్దతు ప్రకటిస్తున్నారు. ఆమె విజయం సాధిస్తే గ్రామ అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంలో అడుగడుగున ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు.







మారెళ్ళ సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ తరఫున కందనాతి రామలక్ష్మి నామినేషన్



తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండల పరిధిలోని మారెళ్ళ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరఫున కందనాతి రామయ్య యాదవ్ సతీమణి కందనాతి రామలక్ష్మి ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. టీడీపీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆమె నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో మారెళ్ళ గ్రామంలో పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. కందనాతి రామలక్ష్మి నామినేషన్ దాఖలుతో టీడీపీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం నెలకొంది. రానున్న రోజుల్లో గ్రామంలో ఎన్నికల ప్రచారం మరింత జోరందుకోనుంది. ఈ కార్యక్రమంలో రామయ్య, మారెళ్ళ అంజి, ఈడిగ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించిన సిఐ వినోద్ బాబు





పాయకరావుపేట, నవంబరు 22 మీ వార్త ప్రతినిధి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేట పట్టణం మరియు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం పాయకరావుపేట సిఐ ఎం వినోద్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు ఈ భారీ కవాతు నిర్వహించారు.



పట్టణంలోని ఇందిరా కాలనీ, దుర్గా కాలనీ, కంటోన్మెంట్, గౌతమ్ ధియేటర్ జంక్షన్ నుండి వై-జంక్షన్ వరకు ప్రధాన వీధుల గుండా ఈ కవాతు కొనసాగింది. అదేవిధంగా మండలంలోని పాల్మన్ పేట కొర్లయ్యపేట, వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వినోద్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి, ఎన్నికలు సజావుగా జరిగేందుకు తోడ్పడాలని సిఐ వినోద్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జె పురుషోత్తం, మహమ్మద్ అలీ, ఎస్ సన్యాసిరావు, ఎఎస్ఐ గోవిందరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ చైర్మన్ శ్రీధర్ కు సత్కారం

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 22 అమలాపురం పురపాలక సంఘ చైర్మన్ గా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్న నల్లా శ్రీధర్ ను ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు,టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు..



కూటమి అభ్యర్థులను గెలిపించండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం నవంబర్ 22 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ విప్ మరియు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ 39, 37, 35, 34, 40 వార్డుల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ వార్డుల నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలను కలిసి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులు గెలవాల్సిందే అన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, ప్రజలతో జరిగిన ముఖాముఖి సమావేశాలు ప్రత్యేకంగా నిలిచాయి.

ఇండియాకు దారి చూపిన ఓట్ చోరీ

ఓట్ చోరీకి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలతో సర్ ప్రక్రియ పట్ల సుప్రీంకోర్టు దృక్పథం మారింది. 13.30 కోట్ల మంది పౌరులు ఓటుహక్కు కోల్పోయేందుకు కారణమైన ఆ సవరణ ప్రక్రియలోని విధి విధానాలు కొన్నిటిని రద్దు చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సైతం నిర్ణయించి, దిద్దుబాటు చర్యలూ చేపట్టింది. నియమం ప్రకారం అయితే ఓటర్ల సంఖ్య వయోజన జనాభాకు ఇంచుమించు సరిసమానంగా ఉండి తీరాలి. మరి సర్ ప్రక్రియ అమలుపూర్తయిన అనంతరం ప్రతి రాష్ట్రంలోను వయోజన జనాభా --ఓటర్ల నిష్పత్తి ఎలా ఉండనున్నది? ఆ నిష్పత్తి 100 శాతానికి చేరువలో ఉన్నట్టయితే తుది జాబితాలు లోపరహితమైనవని విశ్వసించవచ్చు. లేనిపక్షంలో అవి లోపభూయిష్ఠమైనవి అనేందుకు సంకోచించనవసరం లేదు.

ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైన ఓటర్లలో (మృతులు మినహా) అత్యధికుల పేర్లు మళ్లీ జాబితాలలో చేరనున్నాయి. తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి, తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుతారని, ఈసీఐ ఇచ్చిన హామీ ద్వారా సర్ తుది జాబితాలు సక్రమంగా ఉండేందుకు అవకాశమున్నదనే నమ్మకం కలుగుతోంది. మంచిదే. అయినా, సర్ రాజ్యాంగవిహితంగా అమలవుతున్నదని మొదటినుంచీ వాదించిన ఈసీఐ ఇప్పుడు ఈ చర్యలు ఎందుకు తీసుకుంటున్నట్టు? తన తప్పులకు ప్రాయశ్చితం చేసుకుంటోందా? లేక, సర్‌లో అన్యాయం కొనసాగితే ప్రజలు మరింతగా ఆగ్రహ భాగ్గవులు అవుతారని భయపడిందా? ఏమైనా కావచ్చు కానీ ఒకటి మాత్రం స్పష్టం: తొలగింపులకు గురైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలలో చేర్చడం వల్ల ఓట్ చోరీ వ్యతిరేక ఉద్యమం 2029 నాటికి తన ప్రభావశీలతను పూర్తిగా కోల్పోవడం ఖాయమని భారతీయ జనతా పార్టీ విశ్వసిస్తున్నది.

2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో 'భారత రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్న అంశం ప్రజలను అమితంగా కలవరపరిచింది. స్వాతంత్ర్య నిర్మాతలు, గణతంత్ర రాజ్యాంగ వ్యవస్థాపకుల ఆశయాలు, అభీష్టాలు వమ్ముయిపోతున్నాయనే భావన ప్రజల మనసుల్లో నెలకొన్నది. దీనికితోడు అవధులు లేని అవినీతి, అదుపు లేని ధరల పెరుగుదల, పెచ్చరిల్లిన నిరుద్యోగం, గ్రామీణ శ్రామిక, పట్టణ కార్మిక జనావళికి ఎదుగూ బొదుగూ లేని వేతనాలు, వ్యవసాయ ఆదాయాలు తగ్గిపోవడం, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కొరవడడం, సమాజ జీవితంలో సర్వత్రా నేరపూరిత కార్యకలాపాలు పెరిగిపోవడం మొదలైనవి అన్ని రాష్ట్రాల ప్రజలనూ వేధించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది. అయితే ప్రజల అసంతృప్తి, ఆగ్రహం ఆ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించలేకపోయాయి. ఎన్నికల పూర్వ, అనంతర పొత్తులతో ఎన్డీఏ సర్కార్ 293 మంది సభ్యుల మద్దతును కూడగట్టుకున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 స్థానాలు వచ్చాయి. 'రాజ్యాంగం ప్రమాదంలో పడింది' అన్నది సత్యదూరం కాదు కనుకనే అసంఖ్యాక ప్రజలు ఆ వాస్తవాన్ని విశ్వసించారు. ఆ ఆరోపణతో ఇండియా కూటమి నిర్వహించిన ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. అయినప్పటికీ ఎన్నికలలో పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా పరిణమించలేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి రాగలిగింది.



ఈ నవంబర్ తొలినాళ్లలో అమెరికా కాంగ్రెస్‌కు జరిగిన మధ్యంతర ఎన్నికలలో కూడా ఇటువంటి పరిణామాలే సంభవించడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీ 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ప్రచారానికి డెమొక్రాట్లు దీటుగా ప్రతిస్పందించారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రాజ్యాంగ విరుద్ధ పాలనాశైలి అమెరికన్ ఓటర్లను మనస్తాపానికి గురిచేసింది. ట్రంప్ అప్రజాస్వామిక పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన అంశాలు రెండు: ఒకటి యుద్ధం, మరొకటి ధరలు అందుబాటులో లేకుండాపోవడం. అత్యధిక ఓటర్లకు ఆహారం, ఇంధన ధరలు, గృహ వసతి వ్యయాలు భరించలేని స్థాయిలో పెరిగిపోయాయి. రోజువారీ జీవితం దుర్భరమైపోవడానికి ట్రంప్ విధానాలే కారణమని అమెరికన్లు విశ్వసించారు. గాజా (పాలస్తీనా)పై ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది అమాయక ప్రజలు హతమారిపోవడం, ఆ ప్రాంతం పూర్తిగా విధ్వంసమవడం అమెరికా ఓటర్లను కలవరపరిచింది. ఇజ్రాయెల్‌తో కలిసికట్టుగా ఇరాన్‌పై ట్రంప్ యుద్ధానికి వెళ్లడంవల్లే తమకు కష్టాలు దాపురించాయని వారు గట్టిగా భావించారు. యుద్ధం కారణంగా చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి మూతపడడం, అనేక దేశాలకు వ్యతిరేకంగా ట్రంప్ విచక్షణారహితంగా విధించిన సుంకాలతో స్వదేశంలో ధరలు అలవికాని విధంగా పెరిగిపోయాయని, ట్రంప్ పాలన తమకు కష్టనష్టాలనేకానీ కనీస శ్రేయస్సును ఇవ్వడం లేదని అమెరికన్లు నమ్ముతున్నారు.

భారత్‌లో కూడా అటువంటి పరిస్థితులే ఉన్నాయి. ఆహార ధరలు పెరిగిపోయాయి. టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 12.3శాతంగా ఉండగా, వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్బీఐ నిర్దేశించిన గరిష్ఠ పరిమితిని దాటి 6.1శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం 8.9శాతం. ఒక ప్లేటు శాకాహార భోజనం ధర ఐదు సంవత్సరాల క్రితం రూ.30.80 ఉండగా ఈ నవంబర్‌లో రూ.41.90కి చేరింది. వాస్తవ వేతనాలు స్తంభించిపోయాయి. కుటుంబ పొదుపులు తగ్గిపోయి రుణాలు పెరిగిపోయాయి. అధికారిక సమాచారం ప్రకారమే నిరుద్యోగం పట్టణ ప్రాంతాలలో 6.7శాతం, గ్రామీణ ప్రాంతాలలో 4.2శాతం. శాశ్వత ఉద్యోగాలు ఎవరికీ దొరకడం లేదు.

ముందున్నది ముసళ్ల పండుగే. ద్రవ్యోల్బణం రేటు, నిరుద్యోగం రేటు మరింతగా పెరగనున్నాయి. ఆర్బీఐ త్వరలోనే రెపో రేటును 5.50శాతం నుంచి 5.75 లేదా 6శాతానికి పెంచే అవకాశమున్నది. పీఎల్ఐ పథకాలు (ఉత్పత్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిన ప్రోత్సాహకాలు) సత్ఫలితాలనివ్వడం లేదని అధికారిక సమాచారమే స్పష్టం చేసింది. స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా 14శాతం వద్దనే నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రేటు మరింతగా పెరగకుండా ఎలా ఉంటాయి? ద్రవ్యలోటు, వాణిజ్యలోటు (ముఖ్యంగా చైనాతో), ప్రైవేట్ పెట్టుబడుల కొరత, ప్రభుత్వ మూలధన వ్యయాల తగ్గుదల, మందకొడి డిమాండ్ మొదలైనవి మన ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్నాయి. అయితే ప్రభుత్వం జీడీపీ వృద్ధిరేటు పెరుగుదల గురించి లేని గొప్పలు చెబుతోంది. వికసిత్ భారత్ గురించి ప్రధానమంత్రి, మంత్రులూ ప్రతిరోజూ మాట్లాడుతున్నారు. లగ్జరీ కార్లు, నగరాల శివార్లలో ఖరీదైన బహుళ అంతస్తుల నివాస గృహాల గురించి రోజూ పత్రికలలో మిరుమిట్లు గొలిపే వాణిజ్య ప్రకటనలు వెలువడుతున్నాయి. ఇక ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సుల గురించి చెప్పనవసరమే లేదు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు దేశంలోకి ప్రవహిస్తున్నాయని పాలకులు ఘనంగా ప్రకటిస్తున్నారు. ప్రజలు వీటిని ఒక తమాషా వ్యవహారంగా పరిగణిస్తున్నారు.

ప్రజలు కోరుతున్నదేమిటి? ఉద్యోగాలు, వేతనాలు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు మొదలైనవి కదా. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దాదాపుగా నిలిపివేశారు. కాయకష్టంతో బతికేవారు అటువంటి ఆసరాకు ఆరాటపడుతున్నారు. పీఎల్ఐ పథకాలు వైఫల్యాల పుట్టలు. నైపుణ్యాల అభివృద్ధి పథకం అంతకుమించిన వైఫల్యం. తాగునీరు (జల్ జీవన్) పథకం ఎండిపోయింది. స్వచ్ఛ భారత్ మిషన్ ఒక ఘోర వైఫల్యం.

ఓట్ చోరీ వ్యతిరేక ఉద్యమం ఇండియా కూటమికి కొత్త బలాన్ని సమకూర్చింది. ఎన్డీఏకు గట్టి సవాళ్లను విసిరే శక్తి ప్రతిపక్ష కూటమికి లభించింది. ఇది నరేంద్రమోదీని కలవరపెడుతోంది. గురువారంనాడు ఫిక్కీ వార్షిక సమావేశంలో ఆయన చేసిన ప్రసంగమే అందుకు నిదర్శనం. ఓట్ చోరీ ఉద్యమ అనుభవంతో ప్రజలు ఎదుర్కొంటున్న మరిన్ని సమస్యలపై పోరాడేందుకు ఇండియా కూటమి సమాయత్తమవాలి. అటువంటి పోరాటాలు చేసినప్పుడే తిరుగులేని రాజకీయశక్తిగా ప్రభవించడం సాధ్యమవుతుంది.

దోపిడీ రూపం మారింది.. సారంలో కాదు!

డిజిటల్ భూస్వాములు.. క్లౌడ్ పాలేర్లు!' శీర్షికతో నవంబర్ 10న ఎం.కె.కుమార్ రాసిన వ్యాసంలో ఆయన చెప్పిన విషయాలు భూస్వాములకూ, పాలేర్లకూ సంబంధించినవి కావు. ఆన్లైన్‌లో వర్తకం చేసే పెట్టుబడిదారులను 'డిజిటల్ భూస్వాములు' అనీ, వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనీ ఒక సంస్కరణవాద ఆర్థికవేత్త ప్రతిపాదించిన పదాలను పొరపాటుగా ఉపయోగించారు. అందువల్లనే, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' అని, 'అస్థిరమైన కొత్త కార్మికవర్గం ఆవిర్భవించింది' అనీ కొన్ని పొరపాటు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఏ వస్తువు కొనాలి? అన్న స్వేచ్ఛ కొనుగోలుదారులకు గతంలో ఉండేదనీ, ఆన్లైన్ వ్యాపారం వచ్చాక ఆ స్వేచ్ఛపోయిందన్నారు వ్యాసకర్త. అది కరెక్టు కాదు. అప్పుడైనా ఇప్పుడైనా ఏ వస్తువు కొనాలనే స్వేచ్ఛ కొనుగోలుదారులకు లేదు. పెట్టుబడిదారులు ఏ సరుకులు తయారు చేయిస్తారో, ఏ సరుకుల గురించి ప్రకటనలు విరివిగా ఇస్తారో, దానికి లోబడే కొనుగోళ్లు జరుగుతాయి. కాకపోతే, అప్పుడు షాపులకు వెళ్లి కొనుక్కోవడం ఉండేది, ఇప్పుడు ఆన్లైన్‌లో కొనుక్కునే పద్ధతి కూడా వచ్చింది.

'ఇప్పుడున్నది సంప్రదాయ పెట్టుబడి కాదు, అది క్లౌడ్ క్యాపిటల్' అన్నారు వ్యాసకర్త. ఈ 'క్లౌడ్ క్యాపిటల్' అనేది, సరుకుల్ని తయారు చేయించడానికి పెట్టే 'పారిశ్రామిక' పెట్టుబడి కాదు. 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్సు ప్రస్తావించిన 'వర్తక పెట్టుబడి' తప్ప, వేరుకాదు. వర్తక లావాదేవీలు షాపుల్లో జరుగుతున్నాయా, ఆన్లైన్‌లో జరుగుతున్నాయా అన్నదే తేడా. కుమార్ ప్రస్తావించిన కంపెనీలన్నీ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలే. ఆన్లైన్‌లో వర్తకం చేసే కంపెనీల యజమానుల్ని 'డిజిటల్ భూస్వాములు' అనకూడదు. 'డిజిటల్ వర్తక పెట్టుబడిదారులు' అనాలి. ఆ కంపెనీలు 30--40శాతం కమీషన్ లాక్కుంటాయన్నారు. అవును మరి, పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అది సహజం. సరుకులు తయారు చేయించిన పారిశ్రామిక పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని తామే అమ్ముకునే ఏర్పాటు లేనప్పుడు, ఆ సరుకుల్ని అమ్మిపెట్టమని వర్తక పెట్టుబడిదారులకు ఇస్తారు. ఆ వర్తక పెట్టుబడిదారీ కంపెనీలు ఆ సరుకుల్ని వాటి పూర్తి విలువలకే అమ్మి, అలా అమ్మినందుకు కమీషన్ మినహాయించుకుని, మిగతాది సరుకు యజమానులకు ఇస్తాయి. ఇది పెట్టుబడిదారీ విధానం పుట్టినప్పటినించీ ఉన్నదే. తేడా ఏమంటే ఆన్లైన్ అనే కొత్త రూపమే. ఇంకా, వర్తక కమీషన్ అనేది 'మధ్యయుగాల నాటి భూస్వామి రైతుల నుంచి వసూలు చేసే శిస్తు' లాంటిదే' అని కుమార్ పొరపాటుపడ్డారు. ఏ శ్రమా చేయకుండా కౌలురైతుల నుంచి



భూస్వామి లాగేది 'శిస్తు' కాదు. భూమి కౌలు. భూమి యజమాని ప్రభుత్వానికి చెల్లించే దానిని 'శిస్తు' అంటారు. అమెజాన్ వంటి ఆన్లైన్ వర్తక కంపెనీలకు చిన్న స్థాయి సరుకు పెట్టుబడిదారులు చెల్లించేది సామంతులు చెల్లించే కప్పం లాంటిది అని కుమార్ చాలా పొరపాటుగా పోల్చారు. అది 'వర్తక కమీషన్'.

కుమార్ తెచ్చిన ఇంకో పెద్ద తప్పు పోలిక ఏమిటంటే, కోట్లాదిమంది వినియోగదారులను 'క్లౌడ్ పాలేర్లు' అనడం. ఇంటర్నెట్ ముందు ఎన్ని వేల గంటలు గడిపినా, ఎన్ని వేల వీడియోలు చూసినా, ఏ సరుకూ తయారుకాదు. సరుకు తయారీకి కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత శ్రమా కావాలి. వినియోగదారులు ఏ సాధనాలతో, ఏ శ్రమ చేసి, ఏ సరుకును తయారుచేస్తున్నట్టు? ఇలా భావించడం అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించి, మార్క్సు చెప్పినదానిని సరిగా గ్రహించలేదని అర్థం. పెట్టుబడిదారుల రాబడి రేటు పెరగడాన్ని అర్థం చేసుకోవడానికి, కుమార్ ఇచ్చిన ఉదాహరణ పూర్తిగా తప్పు. ఒక కంపెనీ యజమానికి, స్టాక్ మార్కెట్లో తన కంపెనీ షేర్ల విలువ పెరగడం వల్ల వచ్చిన డబ్బు తన దగ్గర పనిచేసే కార్మికుల నుంచి సంపాదించిన అదనపు విలువ కాదు. అది షేర్లు కొన్నవారి డబ్బు. దానిని మార్క్సు 'కల్పిత పెట్టుబడి' అన్నాడు. ఆ కంపెనీ యజమాని, ఆ కల్పిత పెట్టుబడిని, కొత్త ఉత్పత్తి కార్యంలో పెడితే, దాని ద్వారా కొత్త అదనపు విలువను సంపాదించవచ్చును. అది వేరే సంగతి. "ఇంతటి బహిరంగ దోపిడీ జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?" అని ఒక అమాయకపు ప్రశ్న వేశారు కుమార్. జవాబు చాలా సింపుల్. ఇవి పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను రక్షించే ప్రభుత్వాలు గనక!

ఒక ఆర్థికవేత్త చేసిన విశ్లేషణను ప్రస్తావించి, 'నేటి సమాజంలో కొత్త వర్గం పుట్టుకొచ్చిందని' కుమార్ అమాయకంగా చెపుతున్నారు. ఉద్యోగ భద్రత లేని స్థితి వల్ల నిరంతరం ఏర్పడుతున్న నిరుద్యోగుల్నీ, పార్టు టైం ఉద్యోగుల్నీ, ఇంకా అలాంటివారిని ఉదాహరణలుగా చూపారు. ఇది 'కొత్త వర్గం' కానేకాదు. పెట్టుబడిదారీ విధానం ఎప్పటికప్పుడు, కార్మికులలో ఒక భాగాన్ని నిరుద్యోగంలోనో, చిరుద్యోగంలోనో ఉంచుతుందనీ, వారిని 'అదనపు జనాభా'గా పెట్టుబడిదారులు భావిస్తారనీ మార్క్సు ఏనాడో చెప్పాడు. వాళ్లకే, ఈనాటి కొత్త ఆర్థికవేత్తలు కొత్త పేర్లు పెడతారు. వ్యాసకర్త భావిస్తున్నట్టు, ఇప్పుడున్నది 'కొత్త దోపిడీ వ్యవస్థ' కాదు. దాని రూపమే మారింది తప్ప, సారం ఏమీ మారలేదు. దాన్ని సమూలంగా మార్చడానికి, మార్క్సు చూపిన మార్గాన్ని మించి, "కొత్త తరహా పోరాటమార్గం" ఏదీ లేదు.

బొందిమడుగుల సర్పంచ్ అభ్యర్థిగా కూటమి తరపున సలింద్ర లక్ష్మీదేవి నామినేషన్ దాఖలు



తుగ్గలి, నవంబర్ 22 (మీ వార్త) : తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోటీలో కూటమి తరపున సలింద్ర ధనంజనేయులు యాదవ్ సతీమణి సలింద్ర లక్ష్మీదేవి బరిలోకి దిగారు. ఈ మేరకు ఆదివారం మారెళ్ల స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఆమె తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. బొందిమడుగుల గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది. సర్పంచ్‌గా ఎన్నికైతే గ్రామ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి రహదారుల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం వంటి అంశాలు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో కీలకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి తరపున సలింద్ర లక్ష్మీదేవి నామినేషన్ దాఖలు చేయడంతో ఆమెకు మద్దతుగా గ్రామంలో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారన్నది గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూరాలలో జలవిద్యుత్తుకు ఆటంకం



హైదరాబాద్, : దిగువ జూరాల హైడల్ ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తికి గ్రహణం పట్టింది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్‌కు అనువైన వనరులున్నప్పటికీ కృష్ణానదిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల వల్ల పూర్తిస్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి జరుగడం లేదు. ముఖ్యంగా నది గర్భంలోని బండరాళ్లు, రాతిమేటలు, వరదలతో కొట్టుకొచ్చిన ఇసుక, బురద విద్యుత్తు ఉత్పత్తికి అటంకాలు కలిగిస్తున్నాయి. 240 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో ప్రస్తుతం 212.8 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. దిగువ జూరాల జలవిద్యుత్తు ప్రాజెక్టులో 40 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన 6 యూనిట్లు ఉన్నాయి. 2016 అక్టోబర్ 1 నాటికే అన్ని యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, 2017 అక్టోబర్ 21న నిర్వహించిన లోడ్ పరీక్షలో అసలు సమస్య బయటపడింది.

ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 279.65 మీటర్ల వద్ద ఉండాల్సిన టెయిల్ వాటర్ లెవెల్ వాస్తవంగా 281.30 మీటర్లకు చేరినట్టు గుర్తించారు. పవర్ హౌస్ నుంచి వెలువడే నీరు టెయిల్ రేస్ చానల్ ద్వారా కృష్ణానదిలో కలుస్తుంది. నీళ్లు కలిసే ప్రాంతంలో నదీ ప్రవాహ మార్గం ఇరుకుగా మారిపోయింది. 70-80 మీటర్ల వెడల్పు ఉండాల్సిన ఈ మార్గం రాతిగుట్టల కారణంగా 40 మీటర్లకు కుంచించుకుపోయింది. ఈ బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల టెయిల్ రేస్ చానల్‌లో నీటి మట్టం పెరిగి టర్బైన్ల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. టెయిల్ రేస్ చానల్ అడుగు భాగంలో రాతి దిబ్బలు, కృష్ణానది సంగమ ప్రాంతంలో శిలలు, దిగువన నది ఇరుకుగా మారడం, వరదల సమయంలో కొట్టుకొచ్చిన మట్టి, బండరాళ్లు పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్టు జెన్‌కో గుర్తించింది. నదీ ప్రవాహానికి అడ్డంకులు తొలగించలేకపోవడంతో అందుబాటులో ఉన్న యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

రూ.12.60 కోట్ల వ్యయంతో పనులు

టెయిల్ రేస్ చానల్‌లో పేరుకుపోయిన 2లక్షల క్యూబిక్ మీటర్ల రాతి దిబ్బలు, శిలలను తొలగించడం, కృష్ణానది సంగమ ప్రాంతం నుంచి పుషరఘాట్ వరకు నది గర్భం వెడల్పును 88 మీటర్ల వరకు పెంచడం, 2వేల క్యూబిక్ మీటర్ల మట్టి, బండరాళ్లను తొలగించడంపై జెన్‌కో దృష్టి సారించింది. 2025 సెప్టెంబర్ 23న జరిగిన జెన్‌కో 73వ బోర్డు సమావేశం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రూ.12.60 కోట్ల అదనపు మూలధన వ్యయంతో పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులు పూర్తయితే ఏటా 15 నుంచి 24 మిలియన్ యూనిట్ల అదనపు విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని జెన్‌కో అంచనా వేసింది. ఇందుకు వెచ్చించే మొత్తం 9.5 నెలల్లోనే రికవరీ అవుతుందని జెన్‌కో వర్గాలు చెప్తున్నాయి. ఈ పనులు చేపట్టేందుకు ఈఆర్సీ అనుమతి కోరారు.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

అచ్చంపేట/పదర, సీఎం రాకకోసం మద్దిమడులో పకడ్బం దీగా ఏర్పాట్లు చేయాలని ఎంపీ మల్లురవి అ న్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియో జకవర్గంలోని మద్దిమడుగు గ్రామానికి ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేప థ్యంలో ఆదివారం ఎంపీ మల్లురవి, కలెక్టర్ హే మంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే వంశీకృష్ణలు పరిశీలించారు. మద్దిమడుగులో సంతుసేవాలా ల్ మహారాజ్ విగ్రహా ఏరాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలా లు, ప్రజల రాకపోకల మార్గాలను ఎంపీ మల్లు రవి పరిశీలించి అధికారులకు సూచనలు చేశా రు. సభకు వచ్చే గిరిజనులకు రవాణా, తాగు నీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడు తూ సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహా ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయ డం గిరిజన సమాజానికి గర్వకారణమన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనం తరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.





రష్మిక మందన్న 'మైసా' రిలీజ్ వాయిదా.. నవంబర్ 27న రావడం లేదని మేకర్స్ ప్రకటన!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని తొలుత నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. అయితే, తాజాగా ఈ విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'మైసా' ప్రపంచాన్ని ఎటువంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో, సినిమాకు తగిన గొప్ప అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ దార్శనికతతో నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. కొత్త రిలీజ్ డేట్ వచ్చేలోపు అభిమానులు ఆ ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ, చిత్రంలోని జోష్ నింపే 'ఓసే రాములమ్మ' పాటను ఆస్వాదించాలని మేకర్స్ కోరారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్, టీ-సిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వాయిదా వార్తతో అభిమానులు కొంత నిరాశకు గురైనప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా సినిమాను తీసుకువస్తున్నారన్న అంశం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్.. పసుపు చీరలో మెరిసిపోయిన బాలీవుడ్ బ్యూటీ



సైకిల్ పక్కన దిశా పటానీ అందాల పోజులు.. లేటెస్ట్ ఫొటోలు వైరల్

వెండితెరపై నాగదుర్గ వెలుగు

జానపద పాటలు, కూచిపూడి నాట్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు పొందిన నల్లగొండకు చెందిన నాగదుర్గ వెండితెరపై వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఇడుపు కాయితం' సినిమా షూటింగ్ ఇటీవల పూర్తయి విడుదలకు సిద్ధం కాగా.. తాజాగా 'శనార్తి' చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. జానపద గీతాల ద్వారా తన అభినయం, హావభావాలతో ప్రేక్షకులను అలరించిన నాగదుర్గ ఇప్పుడు పూర్తిస్థాయి సినీ నటిగా మారుతున్నారు. ఇప్పటికే ఆమె నటించిన ఇడుపు కాయితం చిత్రీకరణ పనులు పూర్తయి, విడుదల దశకు చేరుకున్నాయి. మరోవైపు కొత్త ప్రాజెక్ట్ శనార్తి సినిమాకు నాగదుర్గ పచ్చజెండా ఊపారు. కథాంశం, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఈ చిత్రంపై ఆమె ఎంతో ఆశలు పెట్టుకున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న శనార్తి సినిమాతో ఆమె కెరీర్‌లో మరో కీలక ఘట్టం మొదలవనుంది.

కళాసేవలోనూ ముందుంటూ...

ఒకవైపు జానపద పాటలు, యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, మరోవైపు సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా.. నాగదుర్గ తన మూలాలను, కళాసేవను మర్చిపోలేదు. పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడిలో పీజీ పూర్తి చేసిన ఆమె, భవిష్యత్‌లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. నల్లగొండలో నాగదుర్గ నాట్యాలయం పేరుతో కూచిపూడి శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ వారాంతాల్లో స్వస్థలానికి వచ్చి కళాభివృద్ధికి పాటుపడుతున్నారు.

కూచిపూడి నుంచి మొదలైన పయనం

ఉమ్మడి నల్లగొండ జిల్లా అడ్డగూడూరు నాగదుర్గ స్వస్థలం. ఉద్యోగరీత్యా తల్లిదండ్రులు నల్లగొండలో స్థిరపడ్డారు. నాగదుర్గ పదో తరగతి వరకు నల్లగొండలో చదువుకుని, హైదరాబాద్‌లో ఇంటర్, బీఎస్సీ పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే నృత్యంపై ఉన్న మక్కువతో కూచిపూడిలో శిక్షణ తీసుకున్నారు. 2021లో 'తిన్నాతీరం పదతలే' జానపద పాటతో నటనలోకి అడుగుపెట్టిన ఆమె. నాలుగేళ్ల వ్యవధిలో సుమారు 300 జానపద పాటల్లో నటించి యూట్యూబ్‌లో కోట్లాది వ్యూస్, 100 మిలియన్ మార్క్‌ను అందుకున్నారు. శాస్త్రీయ నృత్యం నుంచి జానపదంలోకి వచ్చి, ఇప్పుడు వరుస సినిమాలతో వెండితెరపై తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు.

